

# సంపాదకీయం

సృష్టిలో, మానవులందరిలో మహోన్నతమైన స్థానాన్ని పొందిన వారు మరియతల్లి. ఆమెను ఎన్నెన్నో పేర్లతో బిరుదులతో గౌరవించారు. శ్రీసభ పితామహులు, పునీతులు, వేద పండితులు ఆమెను “నిష్కళంకమాత” అని “సర్వేశ్వరుని మాత” అని, “నిత్య సహాయమాత” అని “జపమాల రాజ్ఞి” అని పిలిచారు. ఎలా చదవాలో తెలియాలేగాని, “ ప్రతి మనిషి ఒక గ్రంథమే” అన్నారు పెద్దలు. అంతటి మహిమాన్వితమూర్తి గురించి ఎంత తెలిసినా తక్కువే, ఎంత చెప్పుకున్నా తక్కువే.

జపమాలమాతగా కొనియాడబతుతున్న మరియమాత మానవ రక్షణ ప్రణాళికలో ఆమె త్యాగం, వినయం, విధేయత ఎంతో శ్లాఘనీయం. ఆమె సహకారంతో తన కుమారుడైన క్రీస్తు రక్షణ అనుగ్రహాలు పొందిన కతోలిక విశ్వాసుల సంఘం ఆమెకు జీవితాంతం ఋణపడి ఉండవలసిందే. ఎలా? అంటే ఆమెకు ప్రీతి పాత్రమైన జపమాలను ధ్యానించడం ద్వారా అని నా భావన, నా నమ్మకం.

ప్రియ విశ్వాసులారా! “సుగుణాలరాశి” అయిన మరియతల్లిని గూర్చి కొన్ని విషయాలు తెలుసుకుందాం!

సాతానుని ప్రలోభానికి లొంగి, దైవాజ్ఞను దిక్కరించి, తన అవిధేయత ద్వారా దేవుడు తనకు తోడుగా ఇచ్చిన పురుషునితో సహా పాపం కట్టుకొని మానవ పతనానికి కారణమైన తొలి అవ్వకు ధీటుగా నిలచి తన విధేయత ద్వారా, తండ్రి దేవుడిచ్చిన పురుషుని (జోజప్పగారు) సహకారంతో నూతన అవ్వ అయిన మరియమాత మావన పునరుద్ధరణకు కారణం అయింది. తొలి అవ్వ సాతానుకు ప్రతీకగా ఉన్న సర్పము యొక్క మాటలను నమ్మి మోసపోయింది. నూతన అవ్వ (మరియతల్లి) అదే సర్పము యొక్క తలను చితకత్రొక్కి విజయ గర్వంతో నిలచింది. తొలి అవ్వ దైవాజ్ఞలను దిక్కరించి దేవుణ్ణి ఆగ్రహానికి గురిచేస్తే, నూతన అవ్వ (మరియతల్లి) తన విధేయతతతో దేవుని సంతోష పరచింది. పొగడ్తలకు, ముఖస్తుతులకు, ఆడంబరాలకు మురిసిపోయే లోకానికి గొడ్డలిపెట్టు మరియతల్లి.

“స్త్రీలందరిలో నీవు ఆశీర్వదింపబడినదానవు. నీ గర్భఫలము ఆశీర్వదింపబడెను” అని పలికిన ఎలిశబేతమ్మ మాటలకు పొంగిపోలేదు మరియతల్లి. మన గొప్పతనం గురించి, మన బిడ్డల గొప్పతనం గురించి వేరేవాళ్ళు గొప్పగా చెప్పినప్పుడు మనం

గాల్లో తేలిపోతాం. మన స్థితిగతులనే మర్చిపోతాం. కానీ మరియతల్లికి అంతటి ధన్యత, ఘనత లభించినా, గర్వపడలేదు కానీ ఒక సాధారణ భావాన్నే వ్యక్తం చేస్తూ దేవుణ్ణి స్తుతించింది.

"నిన్ను మోసిన గర్భమును, నీకు పాలిచ్చిన స్తనములును ధన్యమైనవి" అని జనసమూహంలో ఒక స్త్రీ ఎలుగెత్తి పలికినప్పుడు. అది తెలిసిన మరియతల్లి సంతోషంతో గంతులు వేయలేదు. గర్వంతో ఉప్పొంగి పోలేదు. ఇంటిటా తన గొప్పతనాన్ని చాటింపలేదు. కృతజ్ఞతాభావంతో దేవుణ్ణి స్తుతించింది.

"ప్రజలందరి ఎదుట నీవు ఏర్పరిచిన రక్షణను కనులారా గాంచితిని" అని సిమియోను ప్రవక్త పలికినప్పుడు మరియతల్లి ఆశ్చర్యపడిందే తప్ప, ఎప్పుడూ ఇతరుల మీద పెత్తనం చెలాయించలేదు. ఒక ప్రవక్తే, తన కుమారుని గురించి గొప్పగా చెప్పినప్పుడు, అదంతా తన గొప్పతనంగా భావించలేదు మరియతల్లి. మౌనంగా దేవుని మననంచేస్తూ ఆదర్శవంతమైన జీవితం జీవించింది.

"మానవ సేవయే మాధవసేవ" అన్నారు. పరులసేవకై కొంతమంది రేయింబవళ్ళు శ్రమిస్తారు. (ఉదా: మధర్ థెరిస్సా). ఎలిశబేతమ్మకు సహాయపడాలని ఆశించింది మరియతల్లి. దూరాన్ని లెక్కచేయలేదు. కష్టకాలం గడిచేవరకు ఆమెకు తోడుగా ఉంది. అప్పటికే దేవదూత వర్తమానం అందుకున్న మరియతల్లి తన గొప్పతనాన్ని పరోపకారంలో చూపించలేదు. కానాపల్లెలో కుటుంబ అవసరాన్ని గుర్తించి, కుటుంబ గౌరవాన్ని పరోక్షంగా కాపాడిన నిత్య పరోపకారి మరియతల్లి.

ఇలా చెప్పుకుంటూపోతే, రాసుకుంటూ పోతే మాటలు చాలవు, గ్రంథాలు సరిపోవు. అలాంటి ధన్యురాలైన మరియమాతను, మన ఆధ్యాత్మిక తల్లిని మన విశ్వాస యాత్రలో తోడుగా ఉండి నడిపించే పరోపకారిణి అయిన జపమాలరాజ్ఞి అయిన మరియతల్లిని ఈ జపమాల మాసంలో (అక్టోబరు) మన "ప్రార్థన మాల" జపమాలతో సన్మానించడం మనం ఆమెకు ఇచ్చే గౌరవం.

**ఫా. దామాల విజయ కుమార్**
**ఎడిటర్**

# సామాన్య 27 వ ఆదివారం
# 07-10-2018

**యెషయా 35:4-7 యాకోబు 2:1-5 మార్కు 7:31-37**

## ప్రధాన సందేశం:

దైవకుమారుడైన క్రీస్తు ప్రభువు ద్వారా క్రైస్తవులమైన మనమందరమూ తండ్రి దేవునికి కుమారులవుతున్నాం, కొమార్తెలమవుతున్నాం, ఆ మేరకు తండ్రి కుడిపక్కన ఆసీనులై ఉన్న యేసుక్రీస్తు ప్రభువు మనకు సహోదరుడవుతున్నారు. అలా "పిత", "పుత్రుడు", "మనము" కలసి ఒకే కుటుంబంగా మారుతున్నాం.

దివ్యబలి ద్వారా మనం నిత్యమూ క్రీస్తు ప్రభువుతో మనకు గల ఎకీభావాన్నీ అనుబంధాన్నీ, అలాగే ఆయన పట్ల మనకు గల విశ్వాసాన్నీ, ప్రేమనూ వ్యక్తం చేస్తూంటాం. అలాగే దివ్యబలిలో యేసు ప్రభువు మనలను వాత్సల్యంతో అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తారు, తండ్రి దేవుని సంకల్పాన్ని నెరవేర్చే శక్తి సామర్థ్యాలను మనకు అనుగ్రహిస్తూ ఉంటారు, అలాగే ఆది తల్లిదండ్రులు ఆదాము, ఏవలు పాపం చేయకమునుపు దేవుడు మానవులకు నిర్దేశించిన జీవన గమ్యాన్ని చేరుకోవడానికి, నిత్యానందభాగ్యాన్ని చవిచూడడానికి మనకు తోడ్పడతారు.

## మొదటి పఠనం: ఆది 2:18-24

ఈనాటి మొదటి పఠనంలో మనం దేవుడు పురుషుడి నుంచి స్త్రీని ఏ విధంగా సృష్టించారో తెలుసుకోవడంతోపాటు, "భార్యాభర్తల" మధ్య ఏర్పడే "విడదీయలేని" అనుబంధాన్ని గురించి కూడా తెలుసుకోగలుగుతున్నాం.

దేవుడు మానవుణ్ణి తన పోలికలో, తన రూపు రేఖలతో సృష్టించారు. అంటే దేవుడు నరునికి సత్యాసత్యాలను తెలుసుకొనే విచక్షణ జ్ఞానాన్ని ప్రసాదించారు. ప్రేమించే శక్తినీ, ప్రేమను పొందే సామర్థ్యాన్నీ అనుగ్రహించారు. అలాగే "నరుడు ఒంటరిగా జీవించుట మంచిది కాదు" అని తలచిన దేవుడు, అతడికొక తోడును కల్పించాలని నిశ్చయించుకున్నారు.

అప్పుడు దేవుడు నరుని "పక్కటెముకతోనే" స్త్రీని సృష్టించి, అతడికి తోడు కల్పించారు, నరుడు ఆమెలో తన పోలికలను చూచుకోగలిగాడు. "ఈమె నావంటిదైనది...

కావున నారి యగును” అంటూ ఆమెకు పేరు పెట్టాడు, ఆమెను జీవిత భాగస్వామిగా స్వీకరించాడు. నాటి నుంచి వారి జీవన సాహచర్యం ఆరంభమయింది. అంటే దేవుడు నిర్దేశించిన మార్గంలో వారు పరస్పరం ఒకరి గురించి ఒకరు తెలుసుకోవడం, ఒకరి నొకరు గౌరవించుకోవడం, ప్రేమను పంచుకోవడం ప్రారంభించారు, అలా “వారిరువురు ఏక శరీరులయ్యారు”.

ఈ పఠనంలోని కొన్ని పదాల ప్రాధాన్యాన్ని తెలుసుకోవడం బోధకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

**మొదటిది:** 2:23 వచనం తెలుగులో “అప్పుడు” అనే పదంతో ఆరంభమవుతుంది. ఆంగ్లంలో "Now", గ్రీకు మూలంలో "Nun" అనే పదాలు కనిపిస్తాయి. పదాలు వేరయినా ఇవన్నీ సూచించవలసిన అర్థం ఒక్కటే. అదేమిటంటే అప్పటివరకు ఏకాకిగా సంచరించిన నరుడు, ‘సరిజోడు’ కోసం లోకమంతా వెదకి వేసారిన నరుడు “ఎట్టకేలకు” తన వంటి ఒక స్త్రీని కనుగొన్నాడు, “అప్పటికి’, అతడి అన్వేషణ ఫలించింది. ఇదీ “అప్పుడు” Now/Nun పదంలో దాగి ఉన్న  సూచ్యర్థం.

దేవుడు తన ఎదుటికి తెచ్చిన పశుపక్ష్యాదులను చూచినపుడు నరుడు తాను వాటికంటే అధికుడననుకున్నాడు, అవి తన కంటే దిగువ స్థాయి ప్రాణులని గుర్తించాడు. కానీ స్త్రీ ఎదురుపడినపుడు మాత్రం ఆమెలో సాక్షాత్తూ తనను తానే చూచుకోగలిగాడు. “హమ్మయ్య... అప్పుడు” తనకు సరిజోడు దొరికినదని సంబరపడ్డాడు.

**రెండవది:** స్త్రీని చూచి నరుడు “ఈమె నా యెముకలలో ఎముక, నా దేహములో దేహము” అంటూ వర్ణిస్తాడు. దీనిని బట్టి ఇద్దరి మనుగడకూ మూలం ఒక్కటేనన్న సత్యం బోధపడుతుంది, అలాగే ఒకే స్వభావం కలిగిన స్త్రీ పురుషులిద్దరు సరిసమానులనడానికి కూడా ఇది బలమైన ఆధారమవుతుంది. అంతేకాదు ఏక శరీరులైన స్త్రీ పురుషులలో ఏ ఒక్కరూ “ఒంటరిగా” ఉండదగినవారుకారనీ, వారు ఒకరికొకరు తోడుగా ఎల్లవేళలా జంటగా జీవించాలన్నదే దేవుని సంకల్పమని స్పష్టమవుతుంది.

**మూడవది:** 2:24 వచనం ఆరంభంలో ఉన్న “కావుననే” "Therefore" అదే పదం “ఇప్పుడు చెప్పబోయేది ఆఖరి మాట”, “ఇదే అసలు లక్ష్యం” అనే అర్థాలను స్ఫురింపజేస్తుంది. మరి స్త్రీ పురుషులను సృష్టించడంలో దేవుడి లక్ష్యమేమిటి? “ఆఖరి మాట” ఏమిటి?

స్త్రీ పురుషుల మనుగడకు “మూలం” ఒక్కటే గనక. “నరుడు...తన ఆలికి హత్తుకొని పోతాడు, “వారిరువురు ఏక శరీరులవుతారు”.

ఈనాటి సువార్తా పఠనంలో యేసు ప్రభువు ఈ వృత్తాంతాన్నే ఆధారం చేసుకొని దాంపత్య బంధానికి గల పవిత్రత గురించి, అవిభాజ్యమైన ఏకత్వం గురించి ప్రబోధించారు. స్త్రీ పురుష బాంధవ్యాన్ని దీవించిన దేవుని పావన సంకల్పమేమిటో ప్రభువు స్పష్టం చేశారు.

## రెండవ పఠనం: హెబ్రీ 2:9-11

పునీత పౌలు హెబ్రీయులకు రాసిన లేఖలోని భాగాలను ఈ ఆదివారం నుంచి రాబోయే ఏడు ఆదివారాలు దివ్యపూజలో రెండవ పఠనంగా చదువుకోబోతున్నాం. ఇది యూదజాతి క్రైస్తవులకు రాసిన లేఖ. యూదజాతి క్రైస్తవుల్లో ఎక్కువ మంది గతంలో యెరూషలేము దేవాలయంలో యాజకులుగా లేవీయులుగా సేవలందించినవారు. గనక క్రైస్తవ సంఘంలో చేరినప్పటికీ వారి మనస్సంతా దేవాలయం మీద, అక్కడ జరిగే ఆరాధనల మీద, పండుగ పబ్బాల మీదనే ఉంటూ ఉండేది. ఆలాంటి వారందరినీ మందలించడానికే పౌలు ఈ లేఖ రాశాడు.

ఈ లేఖలో పౌలు పూర్వం దేవుడు చేసిన వాగ్దానాలు, దేవాలయంలో ప్రజలు చేసిన అర్చనాదులన్నీ, “ప్రధాన యాజకుడైన” యేసుక్రీస్తు ప్రభువు ద్వారానే నెరవేరాయని, ప్రభువు ఇప్పుడు సాక్షాత్తూ తండ్రి దేవుని కుడి పక్కన ఆశీనులై ఉన్నారనీ, నాడు యెరూషలేము దేవాలయంలో జరిగిన దైవార్చనలు నేడు శ్రీసభలో అర్ధవంతంగా ఫల ప్రదంగా కొనసాగుతున్నాయని వివరిస్తున్నాడు.

అంతేకాదు ఒక వేళ వారు శ్రీసభను కాదని, తిరిగి యెరూషలేము దేవాలయానికి వెళ్ళి, సనాతన అర్చనాకాండనే కొనసాగించదలస్తే క్రీస్తు ప్రభువు ద్వారా తాము పొందిన రక్షణభాగ్యాన్ని కోల్పోతారని పౌలు హెచ్చరిస్తున్నాడు.

కీర్తన 8:4-6 వచనాల్లో ప్రవచించబడిన సత్యాలు క్రీస్తు ప్రభువు ద్వారా ఎలా నెరవేరాయో ఈనాటి పఠనంలో పౌలు సవివరంగా తెలియజేస్తున్నాడు. “నీవు చేసిన సృష్టికంతటికిని అతనిని అధిపతిగా గావించితివి. సమస్తమును అతని పాదముల క్రింద ఉంచితివి” కీర్తన 8:4-6. ఈ ప్రవచనాలు మోక్షారోహనుడై తండ్రి దేవుని కుడి పక్కన ఆసీనుడై ఉన్న యేసుక్రీస్తు ప్రభువు ద్వారా అక్షరాలా నెరవేరాయి, సృష్టిలో

సమస్తమూ మహిమాన్వితుడైన ప్రభు క్రీస్తుకే పాదాక్రాంతమయింది. ప్రభువు తప్ప మరొక మానవమాత్రుడెవ్వరూ సృష్టిమీద ఆధిపత్యాన్ని సాధించలేదు, సాధించలేరు.

ఈ పఠనంలో పౌలు, యేసు క్రీస్తు ప్రభువు ఏ విధంగా "ప్రధాన యాజకుడు" కాగలిగారో, ఏవిధంగా తండ్రి కుడిపక్కన ఆసీనులయ్యారో వివరిస్తున్నాడు.

**ఒకటి:** క్రీస్తు ప్రభువు దేవుని నిత్యకుమారుడు, ఆయన దైవ స్వభావము గలవాడు గనక ఆయనకు మరణం లేదు. అంటే తన కున్న దివ్యస్వభావము వలన ఆయన మరణించడం పునరుత్థానుడు కావడం, మహిమపరుపబడి తిరిగి తండ్రి దేవుని కుడిపక్కన ఆసీనుడు కావడం ఇవన్నీ జరుగడానికి ఆస్కారంలేదు. గనక దేవుని "అనుగ్రహము" వలన, ఆయన సంకల్పం ప్రకారమే దైవ కుమారుడైన క్రీస్తు ప్రభువు "దేవదూతల కంటె తక్కువగా" చేయబడ్డారు. అంటే మానవుడయ్యారు. అలా మనుష్యావతారం దాల్చిన యేసుక్రీస్తు ప్రభువు, తన మానవ స్వభావం వలన మరణానికి తలవంచారు, అనంతరం పునరుత్థానుడై, మహిమ పరుపబడి తండ్రి దేవుని కుడి పక్కన ఆసీనులు కాగలిగారు, అప్పుడు సృష్టిలోని సమస్తము ఆయన పాదముల క్రింద ఉంచబడింది.

**రెండు:** తన కుమారుడు మనుష్యావతారం దాల్చాలన్నది తండ్రి దేవుని సంకల్పం. అలా తన కుమారుడు మనుష్యుడై, మనుష్య స్వభావంతోనే తనతో వ్యక్తిగతానుబంధాన్ని ఏర్పరచుకోవాలని "తండ్రి" కోరుకున్నారు. అంతేకాదు తన కుమారుని మనుష్య స్వభావాన్ని పరిపూర్ణం కావించడానికే ఆయనకు శ్రమలను, మరణవేదనను కలుగజేశారు. ఆ విధంగా శ్రమలననుభవించి మరణించిన "కుమారుడు" చివరికి మరణాన్ని జయించి మహిమ పరుపబడి యావత్ మానవజాతి విమోచనకు కారకుడు కాగలిగాడు.

**మూడు:** ఇలా యావత్ మానవజాతి రక్షణకు కారకుడైన యేసు క్రీస్తు ప్రభువు రక్షాభాగ్యాన్ని కోరుతూ తన వద్దకు చేరే విశ్వాసులందరినీ పవిత్రపరచి, తన "తండ్రికి" యోగ్యులైన "కుమారులుగాను", "కొమార్తెలుగాను" తీర్చిదిద్దుతారు, వారిని దేవుని ప్రియతమ సంతానంగా మలుస్తారు. మరోమాటలో చెప్పాలంటే పవిత్రాత్మ ద్వారా దైవకుమారుని "పవిత్రతలో" పాలుపంచుకొంటోన్న క్రైస్తవులందరు ఆయనకు నిజమైన "అన్నదమ్ములు", అక్కాచెల్లెండ్రు" కాగలుగుతున్నారు. అంటే దైవకుమారుడుగా ఉన్నప్పుడు సాధ్యం కానిది ఆయన మానవుడుగా అవతరించి "మానవస్వభావం" ధరించిన దైవకుమారుడే, తన శ్రమలు మరణ పునరుత్థానాల ద్వారా మహిమ పరుపబడిన ఆ

దైవకుమారుడే ఇప్పుడు మానవ మాత్రులైన క్రైస్తవ విశ్వాసులకు "సహోదరుడు" కాగలిగాడు, ఇదంతా మానవుడుగా ఆయన అనుభవించిన సిలువమరణ పునరుత్థానాల ద్వారానే సాధ్యమయింది.

## సువార్తా పఠనం: మార్కు 10:2-16

ఈనాటి సువార్తా పఠనంలో రెండు ప్రధాన భాగాలున్నాయి

**మొదటి భాగం:** "విడాకుల సమస్యపై" ఫరిసయ్యులకు యేసు ప్రభువుకూ మధ్య చర్చ జరుగుతుంది. నిజానికి ప్రభువును పరీక్షించడానికే పరిసయ్యులు "భార్యను పరిత్యజించుట భర్తకు తగునా?" అని ప్రశ్నించారు. ఇది సున్నితమైన అంశం. పైగా యేసు ప్రభువు అప్పుడున్నది హేరోదు అంతిపాస్ పరిపాలనలో. హేరోదు రాజు తన భార్యకు విడాకులిచ్చి హేరోదియాను వివాహమాడినందుకే బప్తిస్త యోహాను హేరోదును ఖండించడం, అందుకు కక్ష పూనిన హేరోదు యోహానును చంపించడం, ఈ పరిణామాలు జరిగి ఇంకా ఎన్నో రోజులు కాలేదు. ఈ నేపథ్యంలోనే ఫరిసయ్యులు దుర్బుద్ధితో యేసు ప్రభువును కూడా ధర్మసంకటంలోకి నెట్టి లబ్ధిని పొందాలనుకున్నారు, ప్రభువు గనక పొరపాటున మాటతూలితే, హేరోదు చేత ఆయనను కూడా అంతం చేయించవచ్చునన్నది వారి పన్నాగం.

అయితే యేసు ప్రభువు ఫరిసయ్యులు లేవనెత్తిన "విడాకులు" సమస్యను వివాహబంధానికి గల పవిత్రత గురించి, స్థిరత్వం గురించి ప్రబోధించే సదవకాశంగా మలుచుకున్నారు. దైవ చట్టం ఆధారంగానే ప్రభువు తన ప్రబోధాన్ని కొనసాగించారు, తన వాదనను వినిపించారు.

మోషే ధర్మచట్టం ప్రకారం విడాకులు తీసుకోవడం చట్ట సమ్మతమైన పనే అవుతుంది. అయితే ఏయే పరిస్థితులలో ఏయే కారణాల వలన విడాకులు తీసుకోవచ్చునో మోషే ధర్మచట్టం స్పష్టంగా చెప్పలేదు. గనకనే సాధారణంగా ఫరిసయ్యులు "విడాకులివ్వడానికి తగిన కారణాల గురించి వాదోపవాదాలు జరుపుతూంటారు. మత్తయి సువార్తలో ఉన్న ఇదే వృత్తాంతాన్ని చూస్తే మనకీ విషయం స్పష్టంగా తెలుస్తుంది. అక్కడ ఫరిసయ్యులు "ఏ కారణము చేతనైన భర్త భార్యను పరిత్యజించుట తగునా?" అని యేసును ప్రశ్నించారు. "పరిత్యజించవచ్చునని" ఫరిసయ్యులకు తెలుసు, కానీ చట్టంలో చెప్పని "కారణాలను" ప్రభువుతో చెప్పించి ఆయనను ఇరుకున పెట్టదలచారు.

ఇక ప్రస్తుతం మనం చదువుతోన్న మార్కు సువార్తను పరిశీలిస్తే ఇక్కడ ఫరిసయ్యులు "విడాకులకు కారణాలు" అడగడం లేదు, "అసలు విడాకులు ఇవ్వడం తగునా?" అని అడుగుతున్నారు.

అయితే ఫరిసయ్యులతో అర్థం లేని వాదనలకుదిగడం ఇష్టంలేని ప్రభువు నేరుగా సృష్టి ఆరంభంలో దేవుడు వివాహబంధానికి నిర్దేశించిన ప్రణాళికను చర్చకు తెచ్చారు. దేవుని పావన సంకల్పం ప్రకారం స్త్రీ పురుషుల మధ్య ఏర్పడే వివాహబంధం పవిత్రమెనది, సుస్థిరమైనది, విడదీయలేనిది ఇలా "దేవుడు జతపరచిన జంటను మానవుడు వేరుపరుపరాదు" అని స్పష్టం చేశారు ప్రభువు.

అందుకు ఫరిసయ్యులు మోషే ధర్మచట్టాన్ని ప్రస్తావిస్తూ "విడాకుల పత్రమును వ్రాసి యిచ్చి భార్యను పరిత్యజింప తగునని మోషే ఆదేశించారు గదా" అంటూ ఎదురు ప్రశ్నించారు. దానికి వెంటనే స్పందించిన యేసు ప్రభువు " మీ హృదయ కాఠిన్యమును బట్టి మోషే ఇట్లు ఆదేశించాడని" చెబుతారు.

అవును. మోషే కాలంనాటి యూదులే కాదు, లోకంలోని మానవులందరు పాపానికీ మరణానికీ "దాస్యం" చేస్తున్నారు. ఫలితంగా కఠిన హృదయులై ఉన్నారు. గనకనే మోషే వారికి ఆలాంటి ఆదేశాన్ని జారీచేశాడు, అనుమతి నిచ్చాడు. కానీ అది దేవుని ప్రణాళిక కాదు, దైవాదేశమూ కాదు.

సృష్టిలో జంట అనర్థాలైన పాపమూ, మరణమూ ప్రవేశించక మునుపు అమలులో ఉన్న దేవుని ప్రణాళిక ఏమిటో, దేవుని సంకల్పమేమిటో యేసు ప్రభువు వెల్లడించారు. పాపము, మరణమనే జంట అనర్థాల ప్రభావంతోనే మానవులు దేవుని ప్రణాళికను ధిక్కరించి, "ఏకశరీరులుగా" ఉండవలసిన దంపతుల మధ్య "విడాకుల" చిచ్చుపెట్టారు. దానిని క్రమబద్ధం చేయడానికి మోషే మధ్యంతర ఆదేశాలిచ్చాడు. అంతేగాని, దాంపత్యం బంధానికి అదే అంతిమ ఆదర్శంకాదు.

గనకనే యేసు ప్రభువు ఆదికాండం 2:24లో దేవుడు నిర్దేశించిన ప్రణాళికను ప్రస్తావిస్తూ దంపతులు "ఏక శరీరులై ఉందురు" అని చెప్పారు. "ఏక శరీరులుగా" ఉండటము అంటే జీవితాంతమూ కలసి బతకటమనే అర్థ:, వివాహబంధానికి గల స్థిరత్వానికీ, అవిభాజ్య గుణానికీ ఇదే పునాది.

అంతేకాదు పెంతేకోస్తు ఆనంతర కాలంలో" ఆరంభం కాబోయే దేవుని రాజ్యంలో మానవ జాతితో పాటు, సమస్త సృష్టి పునరుద్ధరింపబడుతుంది, అప్పుడు సర్వత్రా

దేవుని తొలిప్రణాళికే అమలు జరుగుతుంది, ఆయన చిత్తమే నెరవేరుతుంది, ఆ భవిష్యద్దర్శనంతోనే యేసు ప్రభువు ఫరిసయ్యులకు, అక్కడున్న ప్రజలకు వివాహబంధం పట్ల దేవుని అభీష్టాన్ని ప్రకటించారు, "దేవుడు జతపరచిన జంటను మానవుడు వేరుపరపరాదు" అని సాధికారికంగా ప్రబోధించారు.

**రెండవభాగం:** దేవుని రాజ్యంలో ప్రవేశించడానికి కావలసిన అర్హతల గురించి తెలియజేస్తుంది. దైవరాజ్య ప్రవేశార్హతలలో ప్రధానమైనవి విశ్వాసం, విధేయత. ఈ సుగుణాలు మనకు యేసు ప్రభువులో మూర్తీభవించి కనిపిస్తాయి. తన "తండ్రి" పట్ల తనకు గల ప్రగాఢ విశ్వాసాన్నీ, విధేయతనూ వ్యక్తం చేస్తూనే ప్రభువు సిలువపై మరణించారు, అలా తనకు విధేయుడైన "కుమారుడు" యేసు క్రీస్తు ప్రభువు ద్వారానే తండ్రి భగవానుడు మానవులకు రక్షణభాగ్యాన్ని ఒక బహుమానంగా ప్రసాదిస్తున్నారు.

దేవుని రాజ్యంలో ప్రవేశించి, వాత్సల్యంతో "తండ్రి" అందజేసే రక్షణ వరాన్ని స్వీకరించే యోగ్యతలు "చిన్నబిడ్డలలో పుష్కలంగా ఉంటాయని యేసు ప్రభువు చెబుతున్నారు. చిన్న పిల్లలు "కఠిన హృదయులు" కారు వారు కల్లాకపటం ఎరుగనివారు, తల్లిదండ్రుల పట్ల సంపూర్ణ విశ్వాసంతో ఉంటారు, తమకు లభించే ప్రతిదానినీ ఒక కానుకగా కృతజ్ఞతతో స్వీకరిస్తారు, తమకు అవసరమైన వాటన్నింటికీ పూర్తిగా తల్లిదండ్రుల మీదనే ఆధారపడుతూ నిశ్చితంగా ఉంటారు.

ఇవన్నీ దైవరాజ్య పౌరుల్లో ఉండే లక్షణాలు. చిన్న పిల్లలు తల్లిదండ్రుల పట్ల ఎంత నమ్మకాన్నీ, విధేయతను ప్రదర్శిస్తారో, దేవుని రాజ్యంలో ప్రవేశించిన వారు "తండ్రి" దేవునిపట్ల అంతటి అచంచల విశ్వాస విధేయతలను చూపుతూ ఉంటారు. తమ బతుకు భారాన్ని దేవునికే అప్పగించి, నిశ్చింతగా నిబ్బరంగా ఆయన సంకల్పాన్ని రనెరవేర్చుతూ, నిత్యానందాన్ని అనుభవిస్తూంటారు. దైవరాజ్యంలో ప్రవేశించిన ప్రతివ్యక్తికి ఈ లక్షణాలు సద్గుణాలన్నీ సహజంగానే అబ్బుతాయి.

నిజానికి పాపం కారణంగా పతనం కాకముందు, "పాపము – మరణమనే" జంట అనర్థాలు సృష్టిలో ప్రవేశించక ముందు ఆది దంపతులు ఆదాము ఏవలు ఇలాగే ఉండేవారు, ఈ సద్గుణాలనే కలిగి ఉండేవారు, కష్టాల కాఠిన్యం తెలియకుండా కన్నీటి చెమ్మ ఎలాంటితో ఎరుగకుండా దేవుని కనుసన్నలలో నిశ్చితంగా జీవనం సాగిస్తూండేవారు.

ఈనాటి సువార్తా పఠనంలోని రెండు భాగాలలోను యేసుప్రభువు "హృదయ

కాఠిన్యాన్ని తొలగించుకొమ్మని” బోధిస్తున్నారు. కఠినమైన హృదయాలు దేవుని చిత్తానికి లోబడి జీవించడానికి అడ్డుపడతాయి, దేవుని ప్రణాళిక ప్రకారం సృష్టిని మానవ జాతిని తీర్చిదిద్దడానికి, పునరుద్ధరించడానికి అవరోధాలుగా నిలుస్తాయి. క్రీస్తు ప్రభువును ఆశ్రయించి, ఆయనను అనుసరించే వారే “మృదుల హృదయులవుతారు”, దైవరాజ్యంలో ప్రవేశించడానికి యోగ్యులవుతారు.

**ముగింపు:**

ప్రేమబంధమే దాంపత్యబంధాన్ని పటిష్టపరుస్తుంది. నిస్వార్థ ప్రేమ పునాదిపై నిలచే కుటుంబమే నిలకడగా ఉంటుంది. నిలకడగల కుటుంబ వ్యవస్థ మీదనే సామాజిక వ్యవస్థ స్థిరత్వమూ, వికాసమూ ఆధారపడి ఉంటాయి. గనక కుటుంబమనే సమాజనికి పునాది వంటిది అంటారు.

కుటుంబ వ్యవస్థ సుస్థిరంగా ఉండాలంటే, దాంపత్య బంధాలు పదిలంగా ఉండాలి, అవిచ్ఛిన్నంగా కొనసాగాలి, “దేవుడు జతపరచిన జంటను మానవుడు వేరు పరుపరాదు”. దేవుని ప్రణాళికలో విడాకులకూ తావులేదు, పరస్పర ప్రేమకు, పరస్పర విశ్వాసానికి, త్యాగశీలానికి, సౌజన్యానికి నెలవులుగా వర్ధిల్లే కుటుంబాలలోను పిల్లలు ఉన్నతమైన వ్యక్తులుగా, ఉత్తమ పౌరులుగా ఆదర్శ క్రైస్తవులుగా వృద్ధి చెందగలుగుతారు.

“పేమ సమస్తమును భరించును,
సమస్తమును విశ్వసించును, సమస్తమును ఆశించును,
సమస్తమును సహించును” ’1 కొరింతి 13:7

స్వచ్ఛమైన ప్రేమ దేవుడు అనుగ్రహించే అపురూపమైన వరం. ప్రేమ వరం కోసం ప్రార్థన చేద్దాం, ప్రేమ పునాదులపై మన కుటుంబాలను పునర్నిర్మించుకుందాం, సమకాలీన సమాజాన్ని ప్రపంచాన్నీ ప్రేమమయం చేద్దాం!

# సామాన్య 28వ ఆదివారం
## 14-10-2018

*సోలో.జ్ఞాన 7:7-11 హెబ్రీ 4:12-13 మార్కు 10:17-30*

## ప్రధాన సందేశం

ఈ లోకంలో ఉండగానే మనం మోక్షానందాన్ని, నిత్యజీవ బాగ్యాన్నీ అనుభవించవచ్చును. అవును. సాక్షాత్తూ "తండ్రి" భగవానుడే మనకు ఆ అవకాశాన్ని కల్పిస్తున్నారు. ఇహలోకంలో జీవిస్తోన్న దశలోనే నిత్యజీవాన్ని పొందుమని, మోక్షానందాన్ని చవిచూడమని దేవుడు మనలోని ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నారు.

అయితే అందుకు దేవుడు ఒక షరతు విధిస్తున్నారు. అదేమిటంటే నిత్యజీవాన్నీ, మోక్షానందాన్నీ కోరుకునేవారు తన కుమారుడైన యేసు క్రీస్తు ప్రభువును అనుసరించాలి, ఆయన ఆదేశాలను తూచా తప్పక పాటించాలి. అందుకుగాను లౌకికమైన వాటినన్నింటినీ వదులుకోగలగాలి. ముఖ్యంగా ఆస్తిపాస్తులను సిరిసంపదలను తృణప్రాయంగా భావించి త్యజించగలగాలి. ఇది అనుకున్నంత సులభం కాదు. అయితే అందుకు అవసరమైన సంకల్పబలాన్ని ఔదార్యాన్నీ యేసు ప్రభువే మనకు అనుగ్రహిస్తారు, తన శరీర రక్తాలనే మనకు "జీవాహారంగా" ప్రసాదిస్తూ మనల్ని ఆధ్యాత్మికంగా బలపరుస్తున్నారు, ప్రభువుపట్ల మనకు గల విశ్వాసాన్ని పటిష్టపరుస్తున్నారు. అలా ప్రభువు ప్రసాదించే దివ్యశక్తితోనే మనం ఇహలోక సంబంధమైన సంపదలమీద ఆధారపడటం మానుకోగలుగుతాం, మన జీవితాలను సంపూర్ణంగా ప్రభువుకే అంకితం చేసి, ఆయన చిత్తానుసారమే జీవించగలుగుతాం.

## మొదటి పఠనం: సోలో. జ్ఞాన 7:7-11

"సోలోమోను జ్ఞానగ్రంథాన్ని" సొలోమోను రాజు పేరిట యూదజాతికి చెందిన భక్తుడొకరు రాశారని బైబులు పండితులు నిర్ధారిస్తున్నారు. ఈజిప్టు దేశంలోని అలెగ్జాండ్రియా నగరంలో స్థిరపడిన యూదజాతీయులలో ఒకరు క్రీస్తు పూర్వం 50 ప్రాంతంలో ఈ జ్ఞాన గ్రంథ రచన చేశారని చెబుతారు.

అప్పట్లో అలెగ్జాండ్రియా సమకాలీన గ్రీకో రోమను ప్రపంచంలో పేరెన్నిక గన్న నగరం. పాలస్తీనా వెలుపల అధిక సంఖ్యలో యూదులున్న నగరం కూడా ఇదే. సంఖ్యాబలం ఎంత గణనీయంగా ఉన్నప్పటికీ ఆ గ్రీకు నగరంలో యూదులు

మైనారిటీలుగానే జీవనం సాగించేవారు. ఎటుచూచినా గ్రీకు సంస్కృతి, గ్రీకు తాత్విక భావజాలం, గ్రీకు మత ప్రాబల్యం. వీటి ప్రభావానికి లోనైన కొందరు యూదులు గ్రీకు సంస్కృతిలో "పరకాయ ప్రవేశం" చేశారు. గ్రీకు సాంప్రదాయక జీవనానికి అలవాటు పడ్డారు, గ్రీకుల జ్ఞాన సంపదలనే పెన్నిధిగా భావించసాగారు.

అయితే మిగతా యూదులు మాత్రం తమ పూర్వికులు నుంచి పారంపర్యంగా వస్తోన్న మత విశ్వాసాలకు, సనాతన సంప్రదాయాలకు కట్టుబడి ఉన్నారు. ప్రభువైన దేవుడు తన కొసగిన జ్ఞానమే లోకోత్తరమైనదని సర్వోన్నతమైనదనీ భావించి, దానికే బద్ధులై జీవిస్తున్నారు. ఈ "జ్ఞానగ్రంథ" రచయిత వారిలో ఒకరు.

ఈ రచయిత సోలోమోను రాజు దైవానుగ్రహంతో పొందిన జ్ఞానవరాన్ని గురించీ, దైవధిక్కారం కారణంగా సోలోమోను జ్ఞానవరాన్ని కోల్పోయినవైనాన్ని గురించీ లోతుగా ఆలోచించి, ధ్యానిస్తూ "జ్ఞానగ్రంథ" రచన చేశాడు. ఈ గ్రంథం ద్వారా అతడు గ్రీకు ప్రజల తాత్విక జ్ఞానం కంటే తమకు దేవుడు ప్రసాదించిన దివ్యజ్ఞానం ఎంత ఉన్నతమైనదో సాటి యూదులకు తెలియజేయదలచాడు, వారికి జ్ఞానోదయం కలిగించాలని సంకల్పించాడు. అతడి ప్రయత్నం ఫలించింది, అతడు రచించిన "జ్ఞాన గ్రంథం" భక్త జనులందరికీ దారిదీపమై నిలచింది!

ఈ పఠనంలో రచిత సోలోమోను రాజు ద్వారానే జ్ఞానసూక్తులు పలికిస్తున్నాడు, లోకంలోని సిరిసంపదలన్నింటి కంటె ప్రభువైన దేవుడు ప్రసాదించే జ్ఞానం ఎంత గొప్పదో తెలియజేస్తున్నాడు. అంతేకాదు. దైవజ్ఞానం పొందడానికి ఏకైక మార్గం భక్తితో చేసే ప్రార్థనేనని కూడా వెల్లడిస్తున్నాడు.

ఇక్కడ బోధకులు గమనించవలసిన ముఖ్యాంశాలు రెండు ఉన్నాయి.

**మొదటిది:** ఈ లోకంలో మానవులు వేటిని విలువైనవిగా అమూల్యమైనవిగా భావిస్తారో, వాటన్నింటికంటె జ్ఞానము ఉన్నతమైనది. "సింహాసనము" కంటెను, "కిరీటము" కంటెను, లౌకిక సంపదల కంటెను, అమూల్యమణుల కంటెను, బంగారము కంటెను, వెండి కంటెను, చివరికి ఆరోగ్యము కంటెను సౌందర్యము కంటెను దేవుడు ప్రసాదించు జ్ఞానమే గొప్పది.

ఇక్కడ ఆరోగ్యాన్ని, సౌందర్యాన్నీ కూడా అమూల్యమైన వస్తువుల జాబితాలో చేర్చుడానికి కారణం ఆనాటి గ్రీకు ప్రజలు "ఆరోగ్యమే మహాభాగ్యమనీ" "అందమే ఐశ్వర్యమనీ" భావించేవారు, వాటి కోసం ఎంత వ్యయప్రయాసలకైనా సిద్ధపడే వారు.

గనకనే జ్ఞానగ్రంథ రచయిత వాటికి కూడా వెండి బంగారాలతో అష్టైశ్వర్యాలతో సమానమైన స్థాయిని కల్పించాడు, వీటన్నింటికంటె కూడా జ్ఞానం శ్రేష్టమైనదన్నాడు.

అయితే జ్ఞాన మొక్కటే సర్వశ్రేష్ఠమైనదైనప్పటికీ, జ్ఞాన మొక్కటి ఉంటే మనిషికి వేరే ఏదీ అవసరం లేనప్పటికీ నిజానికి జ్ఞానాన్ని కోరుకుంటూ దేవునితో సత్సంబంధాలు కలిగి ఉండే భక్తులకు తక్కినవి అన్నీ వాటంతటవ అవే సమకూరుతాయి, ఏలోటూ లేకుండా అతడి జీవనం సాఫీగా సాగిపోతుంది.

**రెండవది:** సూర్యకాంతి కంటే జ్ఞానం అధికమైనదని చెబుతున్నాడు రచయిత. సూర్య రశ్మిలేనిదే లోకంలో ఏ ప్రాణీ మనుగడ సాగించలేదు, అలాంటి ప్రాణాధారమైన సూర్యకాంతి కన్నా జ్ఞానమే మిన్న అంటున్నాడు. ఎందుకంటే అంతటి విలువైన సూర్యరశ్మిని కూడా రాత్రివేళల్లో కనుమరుగుకాక తప్పదు, చీకటికి తలవంచక తప్పదు. కానీ "జ్ఞాన కాంతి ఏనాడును తరగిపోదు", జ్ఞానం నిత్యమూ ప్రకాశిస్తూనే ఉంటుంది, జ్ఞానం వ్యక్తిని నిత్యమూ దేవుని సన్నిధానంలో సంచరింపజేస్తుంది, చైతన్య పథంలో నడిపిస్తుంది.

ఈనాటి సువార్తా పఠనంలో ధనవంతుడొకడు దైవరాజ్యంలో లభించే నిత్యజీవబాగ్యం కోసం తనకున్న సిరిసంపదలను వదులుకోవడానికి వెనుకాడుతాడు, "బాధపడి" వెళ్ళిపోతాడు. ఆ సందర్భంలోనే యేసు ప్రభువు "ధనవంతుడు దేవుని రాజ్యమున ప్రవేశించుట కంటె, ఒంటె సూది బెజ్జములో దూరిపోవుట సులభతరము" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని బట్టి మొదటి పఠనానికీ సువార్తా పఠనాననికీ మధ్యగల సందేశ పరమైన సామర్ధ్యాన్ని మనం  గమనించవచ్చును.

## రెండవ పఠనం: హెబ్రీ 4:12-13

పునీత పౌలు యూదజాతికి చెందిన క్రైస్తవులకు దేవుని "విశ్రామస్థానంలో" ప్రవేశించడం గురించి చేస్తోన్న ప్రబోధంలోని ఒక భాగాన్ని మన మీనాటి రెండవ పఠనంలో చదువుతున్నాం.

"విశ్రామ స్థానంలో ప్రవేవించడము" అంటే శరీరాలతో సహా పునరుత్థానం పొంది పరలోకంలో తండ్రి దేవునితో కలసి నిత్యజీవన భాగ్యాన్ని పంచుకోవడం అని అర్ధం. అలా తన "విశ్రాంతి సదనంలో" ప్రవేశించే అవకాశాన్ని దయామయుడైన దేవుడు అందరికీ కల్పిస్తున్నారు, తన సన్నిధానం తలుపులు బార్లా తెరచే ఉంచారు. గనక తమ అవిధేయత వలన మూర్ఖంగా, దేవుడు కల్పిస్తోన్న "రక్షణావకాశాన్ని

వదులుకోవద్దని పౌలు హెబ్రీయులకు హితవు చెబుతున్నాడు. అంటే తండ్రి దేవుని కుడిపక్కన ఆశీనుడై ఉన్న యేసు క్రీస్తు ప్రధాన యాజకత్వాన్ని తిరస్కరించడం ద్వారా నిత్యజీవ భాగ్యాన్ని చేజేతులా పోగొట్టుకో వద్దని నచ్చజెబుతున్నాడు. దానికి బదులుగా ప్రభు క్రీస్తుకు అనుంగు సోదరుల్లా ఆయనకు సన్నిహితంగా మెలగుతూ, ఆయన యాజకత్వం ద్వారా "నిత్యజీవసదనంలో" ప్రవేశించడానికి ప్రయత్నించాలనీ, అప్పుడు తాను చేసిన వాగ్దానం ప్రకారం తండ్రి దేవుడు తన నిత్యనివాసంలో వారికి తప్పక స్థానం కల్పిస్తారని పౌలు పునరుద్ఘాటిస్తున్నారు.

ఈ సందర్భంలోనే పౌలు "దైవవాక్కునకు" గల మహత్తరమైన శక్తి గురించి హెబ్రీయులకు తెలియజేస్తున్నాడు. ఇహలోకంలో జీవన యాత్రను కొనసాగిస్తూ "విశ్రామస్థానంలో ప్రవేశం" కోసం కృషి చేస్తోన్న విశ్వాసులకు 'దేవునివాక్కు" చక్కని ఆధ్యాత్మిక ఆలంబనగా నిలుస్తుందని చెబుతున్నాడు. అవును. పూర్వం ప్రకటింపబడిన దేవునివాక్కు, కాలం పరిపూర్ణమైనపుడు "కుమారుడు" యేసు క్రీస్తు ప్రభువు ద్వారా వెల్లడిచేయబడిన దైవవాక్కు విశ్వాసులను పవిత్రతా మార్గంలో నడిపిస్తుంది, "విశ్రామ స్థానం "వైపు సాగిపోతోన్న వారికి అండదండగాను మార్గచూపరిగాను నిలుస్తుంది.

"దైవవాక్కు" విశ్వాసుల జీవితాలలో చేసే రెండు ప్రధానమైన పనులను గురించి ఈనాటి పఠనం మనకు తెలియజేస్తుంది.

**ఒకటి:** "దేవుని వాక్కు సజీవమును, చైతన్యవంతమైనది". అంటే సృష్టి ఆరంభంలో దేవుని వాక్కు ఎలా సృజనాత్మకంగా ఉన్నదో, నేటికీ "నూతన సృష్టి" కావించడంలో, విశ్వాసులను నూత్నీకరించడంలో అంతే సృజనాత్మకత ఉంది. అలాగే దేవుని చిత్తాన్ని దేవుని ప్రణాళికను యథాతథంగా నెరవేర్చడంలో నాడు నేడు కూడా చైతన్యవంతమైన పాత్రవహిస్తూనే ఉంది. మరోమాటలో చెప్పాలంటే దేవుని సంకల్పం ప్రకారం "దైవవాక్కు" క్రైస్తవ విశ్వాసులందరినీ "విశ్రామ స్థానంలో ప్రవేశించడానికి" యోగ్యులైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతూ ఉంది, నూత్నీకరిస్తోంది, "నూతన సృష్టి" కావిస్తోంది.

**రెండవది:** మానవ మాత్రులైన క్రైస్తవ విశ్వాసులు తమ అంతరంగాలలో ఏమున్నదో వారే తెలుసుకోలేరు. తమ "హృదయాలలోని ఆశలను ఆలోచనలను విచక్షింపలేరు", అలాగే వాటి గురించి ప్రపంచానికి కూడా తెలియదు. కానీ "దైవవాక్కు" వాటిని కనిపెట్ట గలుగుతుంది, వెలికి తీయగలుగుతుంది, మంచీ చెడులను విడమరచి చూడడానికి సాయపడుతుంది.

అవును. “కత్తివాదన కంటె పదునైన” దేవుని వాక్కు క్రైస్తవ విశ్వాసుల అంతరంగాల లోనికి చొచ్చుకొనిపోయి ఎలాంటి ఆశలూ ఆలోచనలూ “మనస్సుకు” చెందినవో, ఏవి “ఆత్మకు” చెందినవో “తూర్పారబట్టినట్టు” వేరుచేసి చూపగలుగుతుంది, మరోమాటలో చెప్పాలంటే లౌకిక వ్యామోహాలకు హత్తుకొని ఉండే చంచలమైన “మనస్సుకూ” నిత్యమూ మనలను దైవసాన్నిధ్యానికి నడువమని ప్రేరేపించే “ఆత్మకూ” మధ్యగల సున్నితమైన సూక్ష్మమైన వ్యత్యాసాన్ని గుర్తించడానికీ “మనస్సును” నిగ్రహించుకుంటూ “ఆత్మానుసారం” జీవించడానికీ దైవవాక్కు తోడ్పడుతుంది.

చివరిగా “ప్రధానయాజకుడైన” యేసుక్రీస్తు సహాయాన్ని స్వీకరించడానికీ, ఆయన యాజకత్వాన్ని ఆమోదించడానికీ, ఆయన ద్వారా దేవుని “విశ్రామ స్థానం” చేరుకోవడానికీ దేవుని వాక్కు సాయపడుతుంది.

## సువార్తా పఠనం: మార్కు 10:17-30

ఈ పఠనంలో మనం ప్రత్యేకంగా గమనించి ధ్యానించవలసిన అంశాలు నాలుగు ఉన్నాయి.

**మొదటిది:** ధనిక యువకుడొకడు “నిత్యజీవమును పొందుటకు నేను చేయవలసిన దేమి? అని అడిగేందుకు యేసు ప్రభువు దగ్గరికొస్తాడు. వచ్చీ రాగానే యేసును “సత్పురుషుడా!” అని సంబోధిస్తాడు. అంటే “మంచి మనిషీ” అని అర్థం. అప్పుడు యేసు ముందుగా “మంచితనం” దేవుడొక్కరికే స్వంతమనీ, దేవుడొక్కరే “సత్పురుషుడనీ” స్పష్టం చేస్తారు.

అవును దేవుడొక్కరే మంచివారు. మంచి గుణాలన్నీ పోత పోసినట్లు వర్ధిల్లే వారాయనే. మూర్తీభవించిన సౌజన్యం తండ్రి దేవుడు ఒక్కరే! “తండ్రి” మంచితనాన్నే ఆయన కుమారుడు నజరేతు యేసు పుణికి పుచ్చుకున్నారు. ఆయన మనుష్యావతారం దాల్చిన తరువాత కూడా తనకున్న దివ్యస్వభావం వలన నిత్యమూ తండ్రి దేవునితో ఏకమై ఉంటారు గనక, “తండ్రి”లోని మంచితనాన్నీ సకల సద్గుణాలనూ యేసు ప్రభువు స్వీకరిస్తూనే ఉంటారు. నిజానికి ఇది తండ్రీ కుమారుల మధ్య ఆనాటి నుంచి కొనసాగుతున్న నిరంతర ప్రక్రియ. తండ్రి కుమారుల మధ్య ఎలాంటి దాపరికాలూ ఉండవు. తండ్రి తన నిత్యజీవాన్నీ అనంత సౌజన్యాన్నీ కుమారునితో పంచుకుంటూనే ఉంటారు. గనుకనే “మంచివారు, సత్పురుషుడు” అని పిలువదగని మొట్టమొదటివారు “తండ్రి” దేవుడు, రెండవవారు “దైవకుమారుడు” యేసుక్రీస్తు ప్రభువు! ఆ మాటకొస్తే

ఈ లోకంలో "మంచితనం" ఎక్కడ ఎవరిలో కనిపించినా, చివరికి యేసు ప్రభువులో కనిపించినా అందరూ ముందుగా మంచితనానికి మంచి గుణాలన్నిటికీ మూలకారకుడైన తండ్రి దేవునికే ధన్యవాదాలు తెలుపాలి. ఈ సత్యాన్నే ప్రభువు ఆ ధనిక యువకుడికి గుర్తుచేశారు.

**రెండవది:** "దైవాజ్ఞలను నీవు ఎరుగుదువా?" అని యేసు ప్రభువు ధనిక యువకుణ్ణి అడుగుతారు. అయితే ఆ వివరాల్లోకి వేళ్ళేముందు మనం దేవుని చట్టం గురించి పునీత పౌలు చెప్పిన మాటల్ని ఒకసారి గుర్తుచేసుకోవాలి.

"నేను దేవుని చట్టమునకు అవిధేయుడను కాను.. యథార్థముగ నేను క్రీస్తు చట్టమునకు లోనైయున్నాను" అన్నాడు పౌలు. గలతీ అంటే తాను దేవుని చట్టానికి విధేయుడుగా జీవిస్తూనే క్రీస్తు చట్టానికి లోబడి ఉన్నట్లు పౌలు ప్రకటిస్తున్నారు. దీనిని బట్టి దేవుని చట్టమూ, క్రీస్తు చట్టమూ పరస్పరం విరుద్ధమైనవి కావని బోధపడుతుంది. నిజానికి దేవుని చట్టాన్ని పరిపూర్ణంగా నెరవేర్చడానికి "క్రీస్తు ప్రభు చట్టం" దారి చూపుతుంది, సహాయపడుతుంది.

ఎలాగంటే పునీత పౌలు రోమీయులకు రాసిన లేఖలో క్రైస్తవ విశ్వాసులమైన మన మందరమూ "ధర్మశాస్త్రము యొక్క నైతిక విధిని" సంపూర్ణంగా నెరవేర్చాలని చెబుతున్నాడు. అంటే దేవుని పది ఆజ్ఞలను తూచా తప్పక పాటించాలని బోధిస్తున్నాడు.

మరి "క్రీస్తుచట్టం" ఏం చెబుతోంది? క్రైస్తవ విశ్వాసులందరు తప్పనిసరిగా పవిత్రాత్మ ప్రేరణ ప్రకారం, పవిత్రాత్మ శక్తితో జీవించాలని చెబుతుంది. ఇలా క్రైస్తవ విశ్వాసులలో కొలువుదీరి ఉండే పవిత్రాత్మ ప్రభువు ఎప్పటికప్పుడు దేవుని సంకల్పమేమిటో వెల్లడిస్తూనే ఉంటారు, అలాగే దేవుని సంకల్పానికి ఆయన ఆదేశాలకు ఆజ్ఞలకు కట్టుబడి జీవించే శక్తిని కూడా పవిత్రాత్మ ప్రభువే ప్రసాదిస్తూ ఉంటారు. దీనినిబట్టి "క్రీస్తుచట్టానికిలోబడి" నడుచుకొనేవారు తప్పనిసరిగా "దేవునిచట్టాన్నే" సంపూర్ణంగా అర్థవంతంగా నెరవేర్చగలుగుతారని అర్థమవుతుంది.

**మూడవది:** ఇది ధనిక యువకుడు ఆరంభంలో అడిగిన ప్రశ్న: "నిత్యజీవమును పొందుటకు నేను చేయవలసిన దేమి?" ఈ ప్రశ్నకు జవాబిస్తూ యేసు ప్రభువు "పది ఆజ్ఞలు" గురించి ప్రస్తావిస్తారు, అందులోనూ సాటి మానవులతో ఉండవలసిన సత్సంబంధాలకు వర్తించే అయిదు ఆజ్ఞలను గుర్తుచేస్తారు. అందులో భాగంగానే "మోసగింపకుము" అనే ఆజ్ఞను కూడా ఒక ప్రశ్నగా సంధిస్తారు ప్రభువు ఎందుకంటే

సాధారణంగా ఏ ధనికుడూ "మోసం చేయకుండా", పరపీడనకు శ్రమదోపిడికీ పాల్పడకుండా ధనాన్ని కూడబెట్టుకోలేడు.

బహుశా అందుకేనేమో యేసు ప్రభువు ఆ ధనికుడికి గుర్తు చేసిన అయిదు ఆజ్ఞలూ మానవ సంబంధాలకు చెందినవే, దైవ మానవ సంబంధాలకు చెందిన మొదటి మూడు ఆజ్ఞలను ప్రభువు అడగనే లేదు.

అయినా ప్రభువు ప్రస్తావించిన ఆజ్ఞలన్నింటినీ తాను "బాల్యం" నుంచీ పాటిస్తున్నట్టు చెప్పాడా ధనికుడు. యూదమత సంప్రదాయం ప్రకారం 13 యేళ్ళు నిండిన బాలలందరు ధర్మ చట్టాన్ని పాటిస్తారు. బాల్యం నుండి వీనిని అన్నింటినీ పాటించుచునే ఉన్నాను" అని ధనిక యువకుడు చెప్పిన మాటల్లో అజ్ఞానం కొంత, ఆత్మస్తుతి కొంతా కనిపిస్తాయి. ఎందుకంటే పవిత్రాత్మను పొందకుండా ఏ మానవుడూ దేవుని ఆజ్ఞలను సంపూర్ణంగా పాటించలేడు, ఈ సత్యం యేసు ప్రభువుకు తెలుసు, అంతేకాదు లోకానికి పవిత్రాత్మను ప్రసాదించవలసినవాడు తానేనని కూడా ప్రభువు ఎరుగుదురు.

అందుకే తనకున్న ఆస్తిపాస్తులన్నింటినీ అమ్మి, పేదలకు దానం చేసి, అప్పుడొచ్చి ఆయనను అనుసరించాలని చెప్పారు ప్రభువు, "నీవు వెళ్ళి నీకు ఉన్నందంతయు వెచ్చించి, దరిద్రులకు దానము చేయుము. ఆ పిదప వచ్చి నన్ను అనుసరింపుము"

అంటే కేవలం ఆస్తిపాస్తులు అమ్మి పేదలకు దానం చేసినంత మాత్రాననే నిత్యజీవం ప్రాప్తించదు, అందుకు యేసు క్రీస్తు ప్రభువును అనుసరించక తప్పదు. ఇలా ఒక వ్యక్తి తన ఆస్తిపాస్తులను త్యజించడం ద్వారా, తాను యేసు ప్రభువును అనుసరించడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించినట్లు అవుతుంది. ప్రభువును అనుసరించడానికి అది మార్గాన్ని సుగమం చేస్తుంది, అంతేగానీ దానితోనే "ముక్తిభాగ్యం" లభ్యంకాదు.

క్రీస్తు అనుసరణం ద్వారానే మానవులు "నిత్యజీవన భాగ్యానికి" వారసులు కాగలుగుతారు. ఇలా యేసుక్రీస్తు ప్రభువును అనుసరించ దలచుకున్న వారు దేవుని పది ఆజ్ఞల పరిధిని దాటి "క్రీస్తు" చట్టాన్ని అనుసరించవలసిన ఉంటుంది.

ఇక్కడ ఆ ధనిక యువకుడు యేసు పలికిన మాటలు అర్ధంకాకనో ఆయన ఇచ్చిన "పిలుపు" అర్థం కాకనో వెళ్ళిపోలేదు. ప్రభువు పిలుపులోని అంతరార్థం అతడికి పూర్తిగా బోధపడింది. అయితే యేసును అనుసరించడానికి అతడికి గల "సంపదే" అడ్డుగోడగా మారింది, అతడి కాళ్ళకుబంధాలు వేసింది.

సంపదలు ప్రతిబంధకాలయ్యాయని అనడం కంటే సంపదలతో ఆ ధనికుడికి ఏర్పడిన అనుబంధం ప్రభు అనుసరణకు అడ్డుపడిందని చెప్పవచ్చు. ఈ వ్యామోహం కారణంగానే "యేసు కొరకు, ఆయన సందేశం కొరకు" ఐహిక సంపదలను, ఇహలోక బంధాలను అతడు వదులుకోలేకపోయాడు.

ఇక్కడే మరొక ధర్మసూక్ష్మాన్ని కూడా మనం తెలుసుకోవాలి. అదేమిటంటే ధనవంతులందరు ''ధనవ్యామోహం'' గలవారనీ, పేద వారందరూ "ధనవ్యామోహంలేనివారని" అనుకోడానికి వీల్లేదు. ఎన్ని సిరిసంపదలు గలవారైనా కొందరు ధనికులు "తామరాకు మీద నీటి బొట్టు" చందంగా సిరులతో అంటీముట్టనట్టు ఉండగలుగుతారు, వాటిని తృణప్రాయంగా వదులుకోగలుగుతారు, మరోపక్క పేద ప్రజల్లో కొందరు తమకున్నవి కొద్దిపాటి ఆస్తిపాస్తులే అయినా వాటిమీద అలవికాని వ్యామోహం పెంచుకొంటారు, వాటిల్లో "పూచికపుల్ల" కూడా వదులుకోడానికి ఇష్టపడరు.

ఇలాంటి "ధన వ్యామోహం" ఎవరిలో ఉన్నా అదే వారు యేసు ప్రభువును అనుసరించడానికీ, "క్రీస్తు చట్టాన్ని పాటించడానికీ అడ్డునిలుస్తుంది. సాక్షాత్తూ తండ్రి దేవుడే అసాధారణమైన రీతిలో వారిని క్రీస్తు ప్రభువు వద్దకు "నడిపిస్తే" తప్ప, ఇలాంటివారు ప్రభువును అనుసరించడం "కష్టం" మాత్రమే కాదు, అసాధ్యం కూడా.

**నాల్గవది:** ఈ సన్నివేశంలో యేసుప్రభువు ధనిక యువకుడి వంక, తన శిష్యుల వంక మొత్త మూడు సార్లు తన చూపును సారించినట్లు సువార్తా కారుడు చెబుతున్నాడు.

10:21వ వచనంలోప్రభువు ధనిక యువకుడి వంక ప్రేమతో చూశారు, అలాగే 10:23వ వచనంలో ప్రభువు శిష్యుల వంక సాలోచనగా చూస్తున్నారు. ఈ రెండు సందర్భాలలోను తనను అనుసరించడం కోసం భౌతిక సంపదలను వదులుకోలేని వారిపట్ల తనకు గల ప్రేమ కారుణ్యాలను ప్రభువు తన చూపుల ద్వారానే వ్యక్తం చేశారు.

ఇక 10:27వ వచనంలో యేసు ప్రభువు తన శిష్యుల వంక మరోమారు చూస్తూ "మానవులకు ఇది అసాధ్యము. కాని, దేవునకు సమస్తము సాధ్యమే" అంటారు, ఆ సందర్భంలో ప్రభువు తన చూపుల ద్వారా, మాటల ద్వారా తండ్రి దేవుని పట్ల అపారమైన "ఆశాభావాన్ని" వ్యక్తం చేస్తారు, సంపదలకు దాసులైన మానవులు తన కుమారుని అనుసరించడానికి నిరాకరించినా, వారిలో మనోపరివర్తనం కలిగించి తిరిగి తన కుమారుని మార్గానికి రప్పించే శక్తి, తన కుమారని చట్టానికి విధేయులను కావించే శక్తి తండ్రి దేవునికి ఉన్నదని ప్రభువు ప్రకటిస్తున్నారు.

**ముగింపు:**

ధనమా? దైవమా? ఈ రెండింటిలో ఒక్క దానికే మన ప్రాధాన్య మీయగలుగుతాం.

ధనార్జన కోసం దైవాన్ని నమ్ముకునే వారిని మనం చూస్తూనే ఉంటాం. ఆలాంటి వారి భక్తి జీవనం స్వార్థపూరితమైనదవుతుందే తప్ప స్వచ్ఛమైన భక్తి జీవనంగా రాణించలేదు. ఆలాంటి వారి జీవితంలో పెద్ద పీట ధనానికే గానీ దేవునికి కాదు. అలాగే జ్ఞానాన్ని ఆర్జించేది సిరిసంపదలను సాధించడానికేనని నమ్మేవారు సంపదలకే ప్రాధాన్యమిచ్చిన వారవుతారు. తప్ప, వారు జ్ఞానులుగా గుర్తింపును పొందలేరు.

జానపదుల జాతీయంలో చెప్పుకోవాలంటే "అవ్వా కావాలీ, బువ్వా కావాలీ" అంటే కుదరదు. ఒకటి కావాలంటే మరొకటి వదులుకోకతప్పదు.

ఈనాటి సువార్తా పఠనంలో మనకు కనిపించే ధనిక యువకుడికి ఇలాంటి పరిస్థితే ఎదురయింది. పాపం అతడు మంచి ఉద్దేశ్యంతోనే యేసు ప్రభువు దగ్గరికొచ్చాడు. నిత్యజీవాన్ని పొందడానికి అవసరమైన "దివ్యజ్ఞానం" కోసం నిజాయితీగా అన్వేషిస్తూ వచ్చాడు. "జ్ఞానం కావాలంటే ధనాన్ని వదులుకోవాలన్నారు ప్రభువు. "ధనమే పోయాక ఎంతటి జ్ఞానం ఉండీ లాభమేమిటనుకున్నాడో ఏమో ఆ యువకుడు వెనుదిరిగి వెళ్ళి పోయాడు.

మరి మన మాటేమిటి?

మన జీవితంలో ఎవరిది ప్రథమ స్థానం?

దేవునిదా? ధనానిదా?

మన జీవితంలో దేనికి అగ్రతాంబూలం?

జ్ఞాన సంపదకా? లౌకిక సంపదకా?

ఆత్మ పరిశీలన చేసుకోవలసిన సందర్భమిది!

# వేదవ్యాపక ఆదివారం
# 21-09-2018

***యెషయా 2:1-5*** ***ఎఫెసి 3:2-12*** ***మార్కు 16:15-20***

## సకల జాతులకు సువార్త

క్రీస్తు సువార్తను బోధించటం, క్రైస్తవ విశ్వాసాన్ని వ్యాపింపచేయటం, శ్రీసభ కర్తవ్యం. అనగా ప్రతి క్రైస్తవుని విద్యుక్త ధర్మం. "ఇహపరములందు నాకు సర్వాధికార మీయబడినది. కనుక మీరు వెళ్ళి సకల జాతిజనులకు పిత, పుత్ర, పవిత్రాత్మ నామమున జ్ఞానస్నానమొసగుచు, వారిని నా శిష్యులను జేయుడు. నేను మీకు ఆజ్ఞాపించినదంతయు వారాచరింప బోధింపుడు. లోకాంత్యము వరకు సర్వదా మీతోనుందును" (మత్తయి 28:18-20) అని యేసు తన శిష్యులతో పలికాడు. క్రీస్తు ఆజ్ఞానుసారం ఆదినుండి శ్రీసభ సువార్తా బోధను అన్నిజాతులకు గరపుతూ, ప్రపంచపు నలుమూలల క్రైస్తవ మతాన్ని స్థాపిస్తూ వచ్చింది. శ్రీసభ ఆరంభం నుండి అనేకమంది మత వ్యాపకానికై విదేశాలకు వెళ్ళి, నానాహింసలపాలై వేద బోధచేశారు. క్రైస్తవ మతం ఒక్క జాతికి, దేశానికి పరిమితమైనది గాదు. అది సార్వజనీనమైనది.

### సకలజాతుల స్తుతి

ఈ దినం మొదటి పఠనంలో యెషయా ప్రవక్త ఆఖరి రోజుల్లో అన్ని జాతులవారు యావే ప్రభువును స్తుతింతురని ప్రవచిస్తున్నాడు. "అంత్య దినములలో పర్వతములపైని యావే మందిరము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటే ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దాని లోనికి వచ్చెదరు. ఆ కాలమున సీయోనులో నుండి ధర్మశాస్త్రము, యెరుసలేములో నుండి యావే వాక్కు బయలు వెడలును, జనులు గుంపులు గుంపులుగా వచ్చి 'యాకోబు దేవుని మందిరమునకు యావే పర్వతమునకు మనము వెళ్ళుదము రండి. ఆయన తన మార్గముల విషయమై మనకు బోధించును, మనము ఆయన త్రోవలో నడుతుము. అని చెప్పుకొందురు..." (యెషయా 2:1-5). ఇస్రాయేలీ ప్రజలు యావే ప్రభువుయొక్క ఎన్నిక ద్వారా ప్రభు ప్రజలయ్యారు. సీనాయి కొండ వద్ద ప్రభువు ఇస్రాయేలుతో ఒడంబడిక చేసియున్నారు. వారు యావేని ఆరాధించే పవిత్ర ప్రజ, యాజకరూప రాజ్యము అయ్యారు. (నిర్గమ 19:5-6). అప్పటి ఆ ప్రజలు సకల జాతులకు యావే ప్రభువుని ఎరిగించటం తమ

బాధ్యతనుకున్నారు. ఇక పూర్వ వేద ప్రజలకు ఎన్నిక ఎలాంటిదో నూత్న వేద ప్రజలమైన మనకు జ్ఞానస్నానం అలాంటిది. దానిద్వారా మనం కూడా ప్రభువు పవిత్ర ప్రజలమూ, అతని పూజించే యాజక రూప రాజ్యమూ అయ్యాము: " మీరు ఎన్నుకొనబడిన జాతి, రాచరికపు గురుకులము, పవిత్రమైన జనము. దేవుని సొంత ప్రజలు. దేవుని అద్భుత కృత్యములు ప్రకటింప నేర్పరుపబడినవారు. ఆయనకు మిమ్ము చీకటి నుండి అద్భుతమగు తన వెలుగులోకి పిలిచెను. ఒకప్పుడు మీరు దైవ ప్రజలు కారు. కానీ ఇప్పుడు మీరు దేవుని ప్రజలు. ఒకప్పుడు దైవకృపను ఎరుగరు కాని ఇప్పుడు మీరు ఆ కృపను చవిచూచితిరి". (1 పేత్రు 2:9-10). ఇస్రాయేలు ప్రజల్లాగే మనం కూడా క్రీస్తును లోకానికి తెలియజేయాలి. ఆయన అద్భుత కృత్యాలను ప్రకటించాలి. క్రీస్తు ప్రేషితుడు. క్రీస్తులోకి జ్ఞానస్నానం పొందిన మనకు ఆయన లక్షణాలు సంక్రమిస్తాయి. ఆయన వలె ప్రతి క్రైస్తవుడు ప్రేషిత కార్యాన్ని చేపట్టాలి. అపుడే యెషయా ప్రవక్త పలికిన ప్రవచనం నెరవేరేది.

## ప్రేషిత బాధ్యత :

ప్రేషితకార్యం, సువిశేష సేవ, గురువులు, మఠకన్యలు మాత్రమే కాక ప్రతి క్రైస్తవుడు నెరవేర్చవలసిన బాధ్యత. జ్ఞానస్నానం ద్వారా ప్రతి క్రైస్తవుడు ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాడు. ఈ బాధ్యతను క్రైస్తవులందరకు ఎరుకపరచి వారిలో మత వ్యాపకానికై ఉత్సాహాన్ని పుట్టించడానికి 11వ భక్తినాథ పాపుగారు 1926 సం॥ ఏప్రిల్ 14వ తేదిన వేదవ్యాపక ఆదివారాన్ని స్థాపించారు. ఈ దినం క్రైస్తవులంతా వేదవ్యాపకానికై ప్రార్థనలు సలిపి, తమ శక్తి కొలది ఆర్థిక సహాయాన్ని అందజేస్తారు. ప్రపంచంలో మూడింట రెండు వంతులకు పైగా క్రైస్తవేతరులు ఉన్నారు. వీరందరకు క్రీస్తు సువార్తను బోధించడాన్కి అందరు సహకరిస్తేనే సాధ్యమయ్యేది. క్రైస్తవ సమాజమంతా కలసి క్రీస్తు జ్ఞాన దేహం. ఈ దేహానికి మనమే అవయవాలం. కనుక మనం పనిచేయందే ఈ దేహం వృద్ధి చెందదు. మనం కృషి చేసి క్రీస్తు దేశమైన క్రైస్తవ సమాజాన్ని పెంపులోకి తీసికొని రావాలి.

## సహాయక సంస్థలు :

క్రైస్తవుల వేదవ్యాపకానికై ప్రార్థనలు సలిపేటట్లు ఆర్థిక సహాయాన్ని అందించేటట్లు ప్రోత్సహించడానికి పలువిధములైన సంస్థలు ఏర్పడ్డాయి. 1822 వ సం॥లో ఫ్రాన్సు

దేశంలోని లియోను పట్టణంలో పౌలిన్ జెరికో అనే వనిత కొందరి సహాయంతో విశ్వవ్యాపక సంస్థను స్థాపించింది. ఈ సంస్థ కాలక్రమేణ పెరిగి పెద్దదై అన్ని దేశాల్లో వ్యాపించింది. వేదవ్యాపకం యెడల క్రైస్తవుల్లో ఆసక్తిని పుట్టించి వారినుండి ప్రార్ధనా సహాయం ఆర్థిక సహాయం కోరటమే ఈ సంస్థ ఉద్ధేశ్యం. అట్లే 1843వ సం॥లో బిషప్ ఫోర్బిన్ జాన్సన్ అనే పీఠాధిపతి ఈ ఉద్యమాన్ని బాలబాలికలలో ప్రచారం చేయటం కోసం మరో సంస్థను స్థాపించారు. దీనిని పరిశుద్ధ పసి బాలల సంస్థ అంటారు. పాశ్చత్య దేశాల్లో ఉన్న బాలబాలికలు వేదవ్యాపక దేశాల్లో ఉన్న తమ తోటి పిల్లలకు సహాయాన్ని అందించటానికి ఈ సంస్థ ఉద్దేశింపబడ్డది. ఆ తరువాత కొంతకాలానికి స్తెఫని బిగార్డ్ అనే వనిత పునీత పేతురు సంఘాన్ని స్థాపించింది. వేదవ్యాపక దేశాల్లో స్థానిక గురువుల శిక్షణకై వలసిన సహాయాన్ని అందించడమే ఈ సంఘం యొక్క ముఖ్య ఉద్ధేశ్యం. 1916వ సం॥ లో పౌలోమన్నా అనే గురువు మరో సంస్థను స్థాపించారు. గురువుల్లో వేదవ్యాపకంపై ఆశక్తిని జనింపజేయడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ప్రేషిత కార్యంలో గురువులు ఆదర్శాన్నివ్వాలి. సువిశేష బోధ జయప్రదం కావాలంటే అదిముఖ్యంగా గురువులపై ఆధారపడి యున్నది. ఈ విధంగా ఈ సంస్థలన్నీ మత వ్యాపకానికై పాటుపడుతున్నాయి. క్రైస్తవులంతా ఈ సంస్థలకు తమ సహకారాన్ని అందించాలి.

## ఆదర్శ జీవితం:

క్రైస్తవులు మంచి క్రైస్తవ జీవితం జీవిస్తూ, క్రీస్తుకు సాక్షులుగా ఉంటూ వేదవ్యాపకానికై తోడ్పడాలి. మన సత్ప్రవర్తన, ఆదర్శ జీవితం,క్రైస్తవేతరులను క్రీస్తు వైపుకు ఆకర్షించాలి. మన విధులను, దినకృత్యములను సక్రమంగా నెరవేర్చటం నీతి, న్యాయం, ధర్మం పాటిస్తూ పరిశుద్ధ జీవితం జీవించటం తోటి వారి యెడల సోదర ప్రేమతో మెలగడం, కుటుంబంలో, సంఘంలో శాంతి పరులుగ జీవించడం ఆదర్శ క్రైస్తవ జీవితం అని చెప్పవచ్చు. మనం దీప స్తభం మీద పెట్టిన దీపం లాంటి వాళ్ళం, పర్వతం మీద నిర్మించిన నగరం లాంటి వాళ్ళంగా జీవించాలి. మన వెలుగు, ఉనికి ఇతరులు గుర్తించి ఆకర్షింపబడాలి. పౌలు తన ప్రేషిత జీవితాన్ని ఓ దీపంతో పోల్చాడు. దీపం తన చమురును తను వ్యయం చేసుకుంటూ మనకోసం వెలుగుతుంది. తాను కాలిపోతూ మనకు వెలుతురునిస్తుంది. అట్లే ప్రతి క్రైస్తవుడు తన స్వార్ధాన్ని వదిలి సువిశేష బోధకై పాటుపడాలి.

# సామాన్య 30 వ ఆదివారం
# 28-10-2018

**యిర్మియా 31:7-9 హెబ్రీ 5:1-6 మార్కు 10:46-52**

## ప్రధాన సందేశం:

క్రీస్తుయేసు ప్రభువు తన శిష్యులకు కొత్త చూపు ననుగ్రహిస్తారు. వారు తనను తెలుసుకొని, అనుసరించడానిక సహాయం చేస్తారు. తనను తెలుసుకున్న శిష్యులు, తమ పపాపు గతానికి స్వస్థిచెప్పి, తమ మనస్సులను మార్చుకొని, తన మాట ప్రకారం తమ బతుకుబాటల్ని దిద్దుకోవాలని ప్రభువు కోరుతున్నారు. అందుకు అవసరమైన "కృపావరాలను" దివ్యబలి" సంస్కారం ద్వారా ప్రభువు తన శిష్యులందరికి అందజేస్తున్నారు. తన మార్గంలో నడచే శక్తియుక్తులను స్వయంగా ఆయనే సమకూర్చుతున్నారు.

## మొదటి పఠనం: యిర్మీయా 31:7-9

యిర్మీయా ప్రవక్త యూదమత గురువు. అతడు దావీదు, సొలోమోను రాజుల కాలంలో ప్రధానయాజకుడుగా ఉన్న అబ్యాతారు వంశానికి చెందినవాడు.

యోషీయా రాజు యూదయాను పరిపాలిస్తోన్న రోజుల్లో యిర్మీయా దైవ పిలుపునందుకొని తన ప్రవచన ధర్మాన్ని ఆరంభించాడు, ప్రవక్తగా మారాడు. నాటినుంచి సుమారు నాలుగు దశాబ్దాల పాటు యూదయా, యెరూషలేముల్లో యిర్మీయా తన ప్రవచనాలతో ప్రకంపనాలు సృష్టిస్తూవచ్చాడు. ఈయన ప్రవచనాల పరంపర క్రీస్తుపూర్వం 587 వరకు కొనసాగింది. ఆ యేడాదే యెరూషలేము బాబిలోనీయుల వశమైంది, యూదయా యెరూషలేముల్లోని ప్రముఖ పౌరులందరు బాబిలోనుకు బానిసలుగా తరలించబడ్డారు. అలా ఇస్రాయేలీయుల చరిత్రలో మరో ప్రవాసదశ, మరో బానిసత్వపు బాధలపర్వం మొదలైంది.

ఇస్రీయేలీయులకు ఈ గతి పట్టబోతున్నదని యిర్మీయా ప్రవక్త ముందుగానే హెచ్చరించాడు. ప్రభువైన దేవునితో వారు చేసుకున్న ఒప్పందాన్ని ధిక్కరించడం వలన, అన్యదేవరలను ఆరాధించి మతభ్రష్టులైనందువలన చివరికి వారు పరాజయం పాలవుతారనీ, మాతృదేశాన్ని కోల్పోయి పరాయి గడ్డమీద బానిసలుగా బతక వలసి వస్తుందనీ యిర్మీయా పలుమార్లు ప్రవచించాడు, దేశ పాలకులను మతాధికారులను దుయ్యబట్టాడు.

ఇలా దేవుడు విధించబోయే శిక్షను ప్రకటించిన యిర్మీయా ప్రవక్తే, తిరిగి దేవుడు వారిని రక్షించబోయే విధానాన్ని కూడా ప్రవచించాడు. బాబిలోను ప్రవాసంలో

ఉన్న ఇస్రాయేలీయులను విడుదల చేయించి, తిరిగి వారిని యెరూషలేముకు రప్పించి ఆ "శేషప్రజలతోనే" ప్రభువైన దేవుడు తిరిగి ఒప్పందం చేసుకుంటారనీ, వారిని పునరుద్ధరిస్తారనీ యిర్మీయా ప్రకటించాడు.

ఈనాటి మొదటి పఠనంలో మనం ఇస్రాయేలీయుల పునరుద్ధరణకు సంబంధించి దేవుడు చేస్తోన్న వాగ్దానాలనే చదువుకుంటున్నాం. యిర్మీయా ప్రవక్తనోట ప్రభువు పలికిన మాటల ప్రకారం ఆయన "ఉత్తర దేశము" నుండి ఇస్రాయేలీ శేస ప్రజలను తిరిగి స్వదేశానికి రప్పిస్తారు, యెరూషలేము నగరాన్ని పునర్నింపజేస్తారు, విశ్వాస పాత్రులుగా "మిగిలిన" ఇస్రాయేలీయులతో తన బాంధవ్యాన్ని కొనసాగిస్తారు.

ఇక ఈ పఠనంలో మనం ముఖ్యంగా మూడు అంశాలను గమనించాలి.

**ఒకటి:** యూదయా పతనం, బాబిలోనియాలో ప్రవాసం ముగిశాక యెరూషలేముకు తిరిగి వచ్చిన శేష ప్రజలను "ఇస్రాయేలు" అని పిలువబోతున్నారు. యిర్మీయా ప్రవచించే నాటికి ఇవన్నీ భవిష్యత్తులో జరుగబోతోన్న సంఘటనలే. అయినప్పటికీ ప్రభువైన దేవుడు పునరుద్ధరించబోతున్న "ఇస్రాయేలు" జాతిని స్మరించుకుంటూ ప్రభువును స్తుంతించుమని పిలుపునిస్తున్నాడు యిర్మీయా. "యిస్రాయేలును తలవంచుకొని సంతసముతో పాడుడు". ఇలా దేవుడు పునరుద్ధరించిన ఇస్రాయేలు "జాతులన్నింటిలోన పెద్దది అవుతుందనీ, ప్రపంచంలోనే ప్రసిద్ధిని పొందుతుందని కూడా యిర్మీయా ప్రవచిస్తున్నాడు. అయితే ఆ గొప్పతనం ఇస్రాయేలీయులది కాదనీ, వారిని శక్తిమంతులను చేసి శత్రువులపై ఘన విజయాలను సమకూర్చిన ప్రభువైన దేవునికే ఈ ఘనత మహిమా దక్కుతాయని ప్రవక్త సూచిస్తున్నాడు.

**రెండు:** బాబిలోను ప్రవాసం నుంచి యెరూషలేముకు తిరిగి వచ్చే శేష ప్రజలదరినీ ప్రభువైన దేవుడు కంటికి రెప్పలా కాపాడుతారు. ప్రభువు మీద గల అపారమైన నమ్మకంతోనే దీనులు, అంగ వైకల్యం గలవారు. అంధులు, గర్భవతులు, రేపోమాపో ప్రసవించబోయే గృహిణులు సైతం యెరూషలేముకు తరలివస్తారు. దయామయుడైన దేవుడు తన సంకల్పం ప్రకారం, తాను నిర్దేశించిన సమయంలో వారిని మాతృభూమికి చేర్చబోతున్నారు, గనక ఆయనే వారికి రక్షాదుర్గమై నిలుస్తారు, పితృోచిత వాత్సల్యంతో వారిని ఆదరిస్తారు, చేయిపట్టి నడిపిస్తారు.

**మూడు:** శేషప్రజల పునరాగమనం "నూతన నిర్గమనం" వంటిది. ఇది పూర్వపు నిర్గమనం వంటిది కాదు. ఆనాటి నిర్గమనంలో ప్రజలు అడుగడుగునా దేవుని శంకిస్తూ ఆయనను అనేక పరీక్షలకు గురిచేశారు. కానీ ఇప్పుడు ఈ నూతన నిర్గమనంలో ప్రజలు ప్రభువైన దేవునిపట్ల పరిపూర్ణ విశ్వాసంతో కదలివస్తారు, దేవునితో చేసుకున్న ఒప్పందానికి పునరంకితులై తరలివస్తారు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఇస్రాయేలీయులు బాబిలోను ప్రవాసం నుంచి విముక్తులై తిరిగి వాగ్దత్త భూమికి చేరుకొనే "చారిత్రక సందర్భాన్ని" ఆనందోత్సాహాలతో కొనియాడాలని ఈ పఠనం బోధిస్తుంది. అలాగే ప్రభువైన దేవుడు తన ప్రజలను "కన్న తండ్రిలా" కాపాడుతారనీ, నిస్సహాయులైన ప్రజలకు సైతం తానే తోడు నీడగా నిలుస్తారనీ ఈ పఠనం ప్రకటిస్తోంది.

ఈ పఠనంలో ప్రభువైన దేవుడు గ్రుడ్డివారి పట్ల తన ప్రేమాదరణలు చూపినట్లే, సువార్తా పఠనంలో యేసు ప్రభువు కూడా అంధుడు "బర్తిమయిని" కరుణించి కనుచూపును ప్రసాదిస్తారు.

## రెండవ పఠనం: హెబ్రీ 5:1-6

పునీత పౌలు హెబ్రీయులకు చేస్తోన్న సుదీర్ఘ ప్రబోధంలో మరొక భాగాన్ని మన మీనాటి రెండవ పఠనంలో చదువుకుటుంన్నాం.

యేసుక్రీస్తు ప్రభువు క్రైస్తవ విశ్వాసుల పాలిట ప్రధాన యాజకుడని పౌలు పునరుద్ఘాటిస్తున్నాడు. అవును. తండ్రి దేవుని కుడి పక్కన ఆసీనులై ఉన్న ప్రభు క్రీస్తు సాక్షాత్తూ మన ప్రధాన యాజకుడనీ, క్రైస్తవులు శరీరాలతో సహా పునరుత్థానులై నిత్యజీవ సదనాన్ని చేరుకోవడానికి ప్రదాన యాజకుని సహకారంతో ఎంతైనా అవసరమనీ పౌలు ప్రబోధిస్తున్నాడు.

అంతేకాదు మన ప్రధాన యాజకుడు యెరూషలేము దేవాలయంలో అర్చనలు చేసే సామాన్య యాజకులు వంటి వాడు కాడనీ, ఆయన సర్వోన్నతుడని పౌలు మనసారా స్తుతిస్తున్నాడు. ప్రభువును ప్రధాన యాజకుడుగా గుర్తించి, ఆయన సహాయాన్ని నిత్యమూ అర్థిస్తూ ఉండాలని కూడా హెబ్రీయులకు హితవు చెబుతున్నాడు.

ఇక ఈ పఠనంలో పౌలు ప్రధానంగా అహరోను వారసులైన యాజకులకు, యేసు ప్రభువుకూ మధ్యగల పోలికలను వ్యత్యాసాలను తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. అహరోను, అతడి వారసులు దైవ ప్రజలకు ప్రతినిధులుగా అర్చనాకాండను నిర్వహించడానికి ఎన్నుకోబడ్డారు, అలాగే యేసుక్రీస్తు ప్రభువు కూడా దైవ కుమారులకు ప్రతినిధిగా యాజక ధర్మాలను, నిర్వర్తించడానికి ఎన్నుకొనబడ్డారు. ప్రత్యేకంగా నియమించబడ్డారు. అయితే ఇక్కడ ఒకే ఒక్క తేడా ఏమిటంటే అహరోను వారసులు, తమకు పూర్వీకులు నుంచి సక్రమించిన వారసత్వం కారణంగానే యెరూషలేము దేవాలయంలో యాజకులు నియమితులయ్యారు. కానీ యేసుప్రభువు ఆవిధంగా ప్రధాన యాజకత్వాన్ని పొందినవారు కారు. ఆయనను మరణం నుంచి జీవంతో లేవనెత్తిన

"తండ్రి" దేవుడే ఆయనను ప్రధాన యాజకుడుగా నియమించారు. "నీవు నా కుమారుడవు, నేను నేడు నీకు తండ్రి నైతిని" అని పలికిన ప్రభువైన దేవుడే యేసు ప్రభువుకు యాజకత్వాన్ని ప్రసాదించారు.

అంతేకాదు "మెల్కీసెదెకు యాజక క్రమమున నీవు సర్వదా యాజకుడవై ఉందువు" అనే ప్రవచనాన్ని నెరవేర్చుతూ ప్రభువైన దేవుడు యేసు క్రీస్తుకు మెల్కీసెదెకు వారసునిగా యాజకుణ్ణి చేశారే తప్ప, అహరోను వారసుడిగా నియమించి యూదులకు మాత్రమే యాజకత్వం వహించుమని చెప్పలేదు. గనకనే "ప్రధాన యాజకుడైన" యేసుక్రీస్తు యూదజాతి యాజకుల కంటె భిన్నమైన వారయ్యారు.

అలాగే యేసుక్రీస్తు ప్రభువుకు "మెల్కీసెదెకు యాజకక్రమంలో యాజకత్వాన్ని ప్రసాదించిన ప్రభువైన దేవుడు, ఆయనను మానవ మాత్రులైన ఇతర యాజకుల కంటె భిన్నమైన వారిని చేశారు. ఆయనను సమస్త మానవ జాతికీ ప్రధాన యాజకుణ్ణి చేశారు, ఆయన యాజకత్వాన్ని విశ్వజనీనం గావించారు.

## సువార్తా పఠనం: మార్కు 10:46-52

మార్కు సువార్తలోని 8:22 వచనం నుంచి 10:45 వరకు గల భాగాన్ని "కేంద్ర భాగం' అంటారు. మార్కు సువార్తను నాటకీయంగా మలుపు తిప్పే మధ్య భాగమిది. ఈ భాగం ఆగంతుకుడైన ఒక గ్రుడ్డివానికి దృష్టిదానం చేయడంతో ఆరంభమవుతుంది. అలాగే అంధుడు "బర్తిమయికి" దృష్టిదానం చేసిన ఘట్టంతో ముగుస్తుంది. ఈ రెండు "దృష్టిదాన" ఘటనలకు మధ్య అత్యంత కీలకమైన సంఘటనలు జరుగుతాయి. "నీవు క్రీస్తువు" అంటూ పేతురు చేసిన విశ్వాస ప్రకటనం, యేసు దివ్యరూపధారణం, యేసు ప్రభువు తన శ్రమలు మరణం పునరుత్థానాల గురించి ముమ్మారు చేసిన ప్రకటనలు, అలాగే యేసు జీవన గమ్యాన్ని గురించి శిష్యుల అవగాహనా రాహిత్యం, క్రైస్తవ శిష్యుల లక్షణాల గురించి ప్రభువు చేసిన ప్రబోధాలు... ఇవీ మార్కు సువార్తా కేంద్ర భాగంలో మనకు కనిపించే కీలకమైన సన్నివేశాలు. ఇవన్నీ యేసు ప్రభువు శిష్యసమేతంగా యెరూషలేముకు వెళ్ళే "మార్గం" లోనే జరుగుతాయి.

యేసు ప్రభువు బెత్సయిదా గ్రామంలో అనామకుడైన ఒక గ్రుడ్డివ్యక్తికి చూపునిచ్చిన ఘట్టంతో ఈ "కేంద్రభాగం" ఆరంభమవుతుంది. ఈ ఆరంభ ఘట్టంలో ఆ గ్రుడ్డివానికి "క్రమక్రమంగా" కంటిచూపు వస్తుంది. అలాగే యేసు ప్రభువుకు దేవుడు నిర్దేశించిన యథార్థమైన గమ్యమేమిటో తెలియని ప్రభు శిష్యులు కూడా కనులున్న గుడ్డివానితో సమానం. అయితే పైన చెప్పుకున్న అంధుడు 'క్రమక్రమంగా" చూపును

పొందినట్లు, ప్రభువుతో పాటు యెరూషలేము వైపు సాగే సుదీర్ఘ ప్రయాణంలో ప్రభు శిష్యులకు కూడా "క్రమక్రమంగా" కనువిప్పు కలుగుతుంది, వారికి సత్యదృష్టి లభిస్తుంది.

అలాగే ఈ కేంద్రభాగం చిట్ట చివర యేసు ప్రభువు బర్తిమయి అనే మరొక అంధునికి దృష్టిదానం చేశారు. ఇతడికి "తక్షణమే" చూపు వస్తుంది. దానితో అతడు మహాదానందభరితుడై యేసును వెంబడిస్తాడు.

ఇక్కడ బర్తిమయి యేసు హస్తాల మీదుగా తక్షణమే దృష్టిని పొందిన సంఘటన ప్రభు శిష్యులకు కలిగిన "కనువిప్పు"కు చక్కని సంకేతంగా నిలుస్తుంది. అవును. ఈ సంఘటన జరిగే సమయానికే శిష్యులు యేసు ప్రభువు ప్రసాదించిన కృపావర ప్రభావంతో, ఆయన పట్ల సదవగాహనను పెంపొందించుకోగలిగారు, దృఢ విశ్వాసాన్ని పొందగలిగారు, అంతేకాదు ప్రభువు తన గమ్యం వైపు కొనసాగిస్తోన్న ప్రయాణంలో ఇనుమడించిన మనోబలంతో, ఆత్మస్థైర్యంతో ఆయనను వెంబడిస్తున్నారు.

గనకనే ఈనాటి సువార్తా పఠనానికి ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. అంధుడు బర్తిమయి కనుచూపును పొందిన సంఘటనను ఈ పఠనం ఎంత కమనీయంగా మన కళ్ళకు కట్టినట్టు చూపుతుందో, అలాగే శిష్యులు యేసు ప్రభువు పట్ల పరిపూర్ణ విశ్వాసాన్ని పెంపొందించుకున్న యథార్థాన్ని కూడా మన మనోనేత్రాల ముందు అవిష్కరిస్తుంది. యేసు ప్రభువే స్వయంగా తన శిష్యులను చీకటి నుంచి వెలుతురులోనికి నడిపించారు. అవిశ్వాసం నుంచి విశ్వాసానికీ, అవగాహనా రాహిత్యం నుంచి అవగాహనా స్థాయికీ, అజ్ఞానం నుంచి ఆత్మజ్ఞాన తీరాలకు, అర్ధ సత్యాల అంధకారం నుంచి పరిపూర్ణ సత్యాల నిత్యకాంతిలోనికి ప్రభువు తన శిష్యులను నడిపించారు. అంధుడు బర్తిమయిని కటిక చీకటి నుంచి కనుచూపు వెలుతురులోనికి నడిపించినట్లే తన శిష్యుల అంతరంగ నేత్రాల అవిటితనాన్ని తొలగించి వారిని ఆత్మ జ్ఞాన తీరాలకు నడిపించారు, జ్ఞానోదయం కలిగించారు.

ఈ పఠనంలోని మరో మూడు అంశాలను మనం దృష్టిలో ఉంచుకోవాలి.

**ఒకటి:** బర్తిమయి 'గ్రుడ్డివాడు, భిక్షకుడు" వినికిడి శక్తిమీదనే ఆధారపడి తన జీవనం సాగిస్తూ ఉండేవాడు. తాను "విన్నమాటల" ద్వారానే అతడు యేసు గురించి తెలుసుకున్నాడు. బహుశా యేసును చూసినవాళ్ళే ఆయన గురించి బర్తిమయికి చెప్పి ఉంటారు. అలా తాను విన్నమాటలు ఆధారంగానే అతడు యేసుప్రభువును అర్థం చేసుకోగలిగాడు, ఆయన పట్ల నమ్మకాన్ని పెంచుకోగలిగాడు. ఒకరోజు "నజరేతు నివాసియగు యేసు" ఆ దారిన వస్తున్నారని విన్నాడు. యేసు అంతదూరంలో ఉండగానే బర్తిమయి "దావీదు కుమారా! యేసు ప్రభూ! నన్ను కరుణింపుము" అంటూ కేకలు

వేయసాగాడు. యేసును ఇలా "దావీదు కుమారా" అని పిలవడం ద్వారానే ప్రభువును గూర్చి బర్తిమయి ఎన్నో విశేషాలు తెలుసుకున్నాడని బోధపడుతుంది. అంతేకాదు యేసుప్రభువే "మెస్సయా" అని బర్తిమయి గాఢంగా నమ్ముతున్నాడని కూడా అర్ధమవుతుంది. "దావీదు కుమారా!" అంటే "మెస్సయా " అని అర్థం.

ఇలా తననెవరైనా "దావీదు కుమారా" అని పిలిస్తే సాధారణంగా ప్రభువు వారిని మందలించేవారు. కానీ ఇప్పుడు అలా చేయలేదు. ఎందుకంటే "మెస్సయా" ప్రభువుగా తాను లోకరక్షణ ధర్మాన్ని పూర్తి చేయవలసిన పుణ్యగడియ ఇంకెంతో దూరంలో లేదు, గనక ఆ సమయంలో తానే "మెస్సయా" అని పదుగురికీ తెలియడం వలన జరిగే నష్టం కూడా ఏదీ ఉండదు. అందుకే ప్రభువు మౌనం వహించి ఉంటారు.

కానీ బర్తిమయి కేకలు విన్న ప్రజలు అతణ్ణి గద్దించారు. అయినా అతడు యేసును పిలవడం మానలేదు. "దావీదు కుమారా! నన్ను కరుణింపుము" అని మరింత బిగ్గరగా కేకలు పెడుతూనే ఉన్నాడు. ఇక్కడ మనం గమనించవలసింది ఏమిటంటే బర్తిమయి యేసును "దావీదు కుమారా" అని పిలుస్తున్నాడే గానీ, తనకు ఏం కావాలో అడగడం లేదు, అంటే యేసే "మెస్సయా ప్రభువని" ఎలుగెత్తి చాటడమే తనకు ముఖ్యమన్న భావన వ్యక్తమవుతోంది.

**రెండు:** ఎట్టకేలకు యేసు బర్తిమయిని పిలిచారు, వెంటనే బర్తిమయి "తన పై వస్త్రములను అచటనే విడిచిపెట్టి" యేసు వైపు అడుగులు వేశాడు. ఇక్కడ అతడు విడిచి వెళ్ళే "పై వస్త్రాలు" అతణ్ణి వీడిపోబోతున్న గుడ్డితనానికి గుర్తులు. శాశ్వతంగా గతించబోతున్న అతడి గతానికి గుర్తులు. నిజానికి యేసు శిష్యులందరు బర్తిమయి బాటలోనే నడవాలి. యేసు చెంతకు చేరడానికి, ఆయనకు చేరువకావడానికి అడ్డుగానిలచే అన్నింటినీ వదులుకోగలగాలి.

**మూడు:** చివరికి బర్తిమయి "బోధకుడా, నాకు చూపు దయచేయుము" అని యేసును వేడుకున్నాడు. అలా "చూపును దయచేయుము" అని బర్తిమయి కోరిన కోరికలతో ప్రభువుకు రెండు అర్థాలు స్ఫురించాయి. ఒకటి: బర్తిమయి తన శరీర ధర్మం ప్రకారం కంటిచూపును పొందగోరుతున్నాడు. అలాగే తన ఆధ్యాత్మిక ధర్మం ప్రకారం "మెస్సయా ప్రభువును కళ్ళారా చూడాలని" ఆతురపడుతున్నాడు. "మెస్సయాను చూడాలనే బర్తిమయి తపనను ప్రభువు గ్రహించి ప్రసన్నులయ్యారు గనకనే తక్షణమే అతడికి "శారీరక స్వస్థతను" ప్రసాదించారు, అతడికి కంటిచూపును దయచేశారు.

అలా బర్తిమయి పొందిన కంటిచూపు అతడికి లోకాన్ని చూచే అవకాశాన్ని కల్పిస్తే, ఆధ్యాత్మికంగా అతడు పొందిన "లోచూపు" అతడికి సాక్షాత్తూ లోకోద్ధారకుని దర్శించే మహద్భాగ్యాన్ని కల్పించింది, అతణ్ణి "రక్షణ మార్గంలో" నడిపించింది.

చివరిగా ఈ పఠనం మనకు వెల్లడించే మరో యథార్థమేమిటంటే "కనుచూపు" పొందిన బర్తిమయి, "కనువిప్పు" కలిగిన ప్రభు శిష్యులు ఇరు పక్షాల వారు యేసు ప్రభు జీవిత గమ్యాన్ని దర్శించగలిగారు, అర్థం చేసుకోగలిగారు, ప్రభువు కొనసాగిస్తోన్న లోకరక్షా ఉద్యమ స్ఫూర్తితోనే లోకాన్నీ లోకంలోని సమస్తాన్నీ దర్శించడం అలవరచుకోగలిగారు! ఈ "కొత్తచూపు" తోనే వారు ప్రభువును వెంబడించారు.

**ముగింపు:**

"బర్తిమయి" కంటి చూపును కోరుకున్నాడు, యేసు ప్రభువు అతడికి కంటి చూపుతోపాటు దేవుని మహత్యాన్ని గ్రహించే "లోచూపును" కూడా ప్రసాదించారు.

మనకు కంటి చూపు ఉండవచ్చు కానీ దయామయుడైన దేవుడు మన జీవితాలలో చేస్తోన్న మహత్కార్యాలనూ, నిత్యమూ మనకు చేస్తోన్న ఉపకారాలనూ గుర్తించే "లోచూపు" మనకు ఉన్నదా?

మనం తల్లి కడుపున ఊపిరి పోసుకున్నది మొదలు ఇప్పటి వరకూ, ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు, మనం నిద్రించేవేళలో సైతం, అనుక్షణం అనుదినం దేవుడు మనలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు, గాలీ వెలుతురు నీరు నిప్పు భూమ్యాకాశాలు అన్నింటినీ దేవుడు మనకోసమే సృష్టించారు, తల్లిలా మనల్ని పోషిస్తున్నారు, తండ్రిలా మనల్ని నడిపిస్తున్నారు, అంతేకాదు మనకోసం తన ఏకైక కుమారుని ఈలోకానికి పంపి మనకు సత్యప్రబోధం చేశారు, "పాప మరణ బంధాల" నుంచి మనల్ని రక్షించారు.

ఇన్ని మహోపకారాలను చేసిన దేవుని మహత్యాన్ని మనం గుర్తించగలుగుతున్నామా? నిత్యమూ ఆయనకు మనసారా స్తుతించగలుగుతున్నామా? ఒకవేళ మనం అలా చేయలేకపోతే, మనకు "లోచూపు" లేనట్లే భావించాలి, ఆధ్యాత్మికంగా మనమూ "అంధులమేనని" తెలుసుకోవాలి. "బర్తిమయి" మాదిరి మనమూ "బోధకుడా, నాకు చూపు దయచేయుము" అంటూ ప్రభువును వేడుకోవాలి.

# జపమాల మరియమాత

క్రైస్తవులకు మహమ్మదీయులకు మధ్య లెపాంటో ఓడరేవు పట్టణంవద్ద గొప్ప యుద్ధం జరిగింది. ఇది సముద్రంలో జరుపబడిన నావికాయుద్ధం. క్రైస్తవుల తరపున ఆస్ట్రియా రాజు డాన్‌జ్వాన్ నాయకత్వం వహించి యుద్ధంచేశాడు. తక్కువ సైన్యమే ఉన్నాకాని క్రైస్తవులు ఆ యుద్ధంలో 1571 అక్టోబరు 7న ఘన విజయం సాధించారు. కన్యమరియాంబగారి మధ్యవర్తిత్వాన సహాయమర్ధించి జపమాలను జపిస్తూ పోరుసల్పి ఘనవిజయం సాధించడమైనదని, ఈ ఘనత ఆ దేవర తల్లికే చెందుతుందని డాన్ జ్వాన్ ఉద్వేగంతో పేర్కొన్నారు. ఈ విజయం జ్ఞాపకార్ధంగా 5వ పయస్ పోపుగారు ఈ జపమాల మరియమాత ఉత్సవాన్ని ప్రవేశపెట్టారు. మొట్టమొదటిగా ఈ జపమాలను పరిశుద్ధ మరియమాతమ్మ తల్లి 13వ శతాబ్దంలో జీవించిన పునీత దోమనిక్ గారికి వెల్లడించారు. అన్ని భక్తి మార్గాలలో జపమాల ఒక గొప్ప అందమైన మధురాతి మధురమైన భక్తిమార్గం. క్రైస్తవ విశ్వాస సంక్షిప్తమే ఈ జపమాల. ఈ విశ్వాసాన్ని తన హృదయం నిండానింపుకున్న మహాఘని మరియమాత ద్వారా యేసుప్రభుని చేర్చగలదే ఈ జపమాల.

మనం మరియతల్లిని ప్రేమిస్తున్నాం అంటే అనుదినం జపమాల చెప్పాలి. మన ప్రేమకు పరీక్ష ఈ జపమాలను చెప్పడమే. ఇది చాలా సులువైనది. ఈ ప్రార్ధన చేసేటప్పుడు మన పెదాలు కదులుతుంటాయి. అలఓకగా "పరిశుద్ధమరియమ్మా! సర్వేశ్వరుని యొక్క మాతా!" అంటూ ప్రార్ధనవల్లిస్తూనే ఉంటాం కాని మనస్సు ఎటెటో విహరిస్తుంటుంది. మన బలహీనత ఆ తల్లికి తెలుసు అర్ధంచేసుకుంటుంది. కాని మన ప్రయత్నం మానుకోకూడదు. జపమాల మన కలిమి. మన బలిమి. మరియతల్లికి దగ్గరవడానికి బంగారుబాట.

మన విశ్వాసాన్ని ప్రకటించే విశ్వాస సంగ్రహంతో జపమాల మొదలెడతాం. మన ప్రభువు నేర్పించిన పరలోకజపం చెప్తాం. పిమ్మట తల్లిని స్తోత్రిస్తాం. మన విన్నపం అర్ధిస్తాం. తర్వాత త్రిఏక దేవునికి మహిమగా స్తోత్రంచెప్తాం. ఆ తర్వాత "ఓ నా జేసువా! నా పాపములను మన్నించండి...." అని ప్రభుని వేడుకుంటాం. ఈ వేడుదల తప్పక చెప్పాలని స్వయంగా మరియమాతమ్మ తల్లియే ఫాతిమానగరంలో పిల్లలకు దర్శనమైనప్పుడు అనగా 1917 మే 13వ తేదీన మరియు జూన్ 13 తేదీన తెలియజేశారు.

పునీత అల్ఫోన్సస్ దె లిగోరిగారు ఈ విధంగా చెప్తున్నారు. "జపమాల భక్తి ప్రపంచానికి అపరిమితమైన మేలులనందించింది. ఎంతో మంది పాపంనుండి విమోచించబడ్డారు. పరిశుద్ధ జీవితం జీవింప గాడినపడ్డారు. మంచి మరణంతో సత్కరింపబడ్డారు. జపమాలను హృదయపూర్వకంగా మనస్సు కలిగి చెప్పాలి. ఒకసారి తల్లి మరియ, పునీత యులాలియ గారితో చెప్పిందేమిటంటే" ఆదరాబాదరాగా తక్కువ భక్తితో 153 పూసల జపమాలను జపించడంకంటే వేగంలేకుండా భక్తితో 53 పూసల జపదండ చెప్పిన చాలు" అని.

6వ పోప్ పౌలుగారు ఏమంటున్నారంటే "జపమాలను వల్లించడం వల్ల ప్రభువు జీవిత పరమరహస్యాల్ని ధ్యానించేటట్లు వ్యక్తికి తోడ్పడుతుంది. ప్రభువుకు దగ్గరగా ఉన్న ఆ తల్లి దృష్టితో మనం ప్రభుని చూడగలం" అని.

# సమాచారములు

## 1. అక్టోబరు నెల జపమాలమాత నెల:.

సత్య శ్రీసభ అక్టోబరు నెలను జపమాలమాత నెలగా ప్రకటించి మరియతల్లి ప్రార్థనా సహాయం ద్వారా దేవుని యొక్క అనుగ్రహాలు పొందడానికి గొప్ప అవకాశాన్ని విశ్వాసులకు ప్రసాదించింది. కావున ఈ నెలలో విశ్వాసులందరు ముఖ్యంగా ఉపదేశులు జపమాల యొక్క ప్రాధాన్యతను గుర్తించి వారు పనిచేసే ప్రాంతాలలో ఈనెల మొత్తం జపమాల ప్రార్ధనలను జరిపించి విశ్వాస వికాసానికి మరియతల్లి పట్ల భక్తిమర్యాదలు పెంపొందించుకోవటానికి విచారణ గురువులకు సహకరించాలని విజ్ఞప్తి.

## 2. ఉపదేశుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు:

అక్టోబరు నెల15వ తారీఖున స్కాలర్‌షిప్పు కోసం ఇంటర్‌మీడియట్, డిగ్రీ, మరియు పీ.జి. చదివే, ధరఖాస్తులు చేసుకున్న ఉపదేశుల పిల్లలకు మేత్రాసన ఎద్యుకేషనల్ సొసైటి నందు అక్టోబరు నెల15వ తారీఖున ఉదయం 9.00గం॥లకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వబడును. ఉపదేశులు మీ పిల్లలతో సమయానికి రావలసినదిగా మనవి.



# ఉపదేశులకు జన్మదిన శుభాకాంక్షలు

| | | | |
|---|---|---|---|
| డి. రాజకుమార్ | బోడవాడ | 01-10-1983 | 9989559259 |
| పి. యేసుబాబు | ముచ్చింతాల | 01-10-1965 | 9948231236 |
| యస్. దానియేలు | గుడ్‌మన్‌పేట | 04-10-1994 | 9849566023 |
| జె. జోజిబాబు | మైలవరం | 05-10-1986 | 9866890910 |
| డి. జోసఫ్ | బంటుమిల్లి | 06-10-1976 | 9849057596 |
| యమ్. మోసెస్ | ఆరుగొలను | 07-10-1975 | 9676528459 |
| వి. రవికుమార్ | వెంట్రప్రగడ | 09-10-1981 | 8142051921 |
| జి. యేసు | కోటపాడు | 09-10-1983 | 9542512881 |
| యమ్. బాలస్వామి | ఆగిరిపల్లి | 10-10-1960 | 9951688752 |
| యమ్. పుష్పరాజు | వెంట్రప్రగడ | 10-10-1950 | 9908376262 |
| జె. సత్యం | కీసర | 10-10-1980 | 9985264428 |
| పి. లూర్దురాజు | కోరుకొల్లు | 10-10-1977 | 8008636947 |
| వై. రాజు | కోటపాడు | 10-10-1969 | 9652322212 |
| కె. ఇస్రాయేలు | కొత్తపల్లి | 10-10-1980 | 9963398421 |
| జి. నవమనిరాజు | మంగినపూడి | 10-10-1960 | 9849743570 |
| బి. అబ్రహాము | తిరువూరు | 10-10-1948 | 7032169400 |
| బి. జాన్‌రాజు | కోరుకొల్లు | 11-10-1972 | 9550622470 |
| టి. కొర్నేలు | కోరుకొల్లు | 12-10-1976 | ---------- |
| జి. అంతోని | రమణక్కపేట | 14-10-1972 | 9704841504 |
| కె. అబ్రహాము | పామర్రు | 15-10-1971 | 7036685692 |
| వి. జీవరత్నరాజు | పామర్రు | 15-10-1982 | 9948979788 |
| జె. జయరాజు | సిలువగిరి | 15-10-1970 | 9391277560 |
| యస్. డేవిడ్‌రాజు | ఆరుగొలను | 16-10-1986 | 9908462790 |
| యమ్. రమేష్ | భాస్కరరావుపేట | 17-10-1969 | ---------- |
| పి. దానియేలు | పోలుకొండ | 17-10-1957 | 9603905181 |
| యమ్. యోహాను | గంపలగూడెం | 18-10-1970 | 9133069189 |
| యమ్. రవి | గంపలగూడెం | 19-10-1981 | 9133831439 |
| పి. ప్రసాద్ | గుడ్‌మన్‌పేట | 19-10-1985 | 9292202182 |
| పి. కిషోర్ | భైరవపట్నం | 22-10-1968 | 9177558043 |
| యమ్. వెంకటరత్నం | నెహ్రూపేట | 23-10-1991 | 9133833409 |
| పి. మరియకుమార్ | కంచికచర్ల | 24-10-1980 | 9493730057 |
| ఎ. విజయకుమార్ | రమణక్కపేట | 30-10-1990 | 9440184752 |